




నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ప్రకాశం బాపట్ల

బుధవారం | 20 ఆగస్టు 2025 | పేజీలు 8


# పనుల నాణ్యతలో రాజీపడొద్దు

- నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్లు భాగస్వాములు కావాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వేటు వేసేందుకు వెనుకాడబోం
- అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి
- నిజాయితీగా పనిచేసే కాంట్రాక్టర్లకు భవిష్యత్తులో సంపూర్ణ సహకారం
- పనులు వేగవంతం చేయండి... బిల్లుల చెల్లింపుపై చర్యలు తీసుకుంటాం
- మూడు నెలల్లో నగర రూపురేఖలు మారిపోవాలి
- ఒంగోలు అభివృద్ధి, ప్రజల సంక్షేమం ముఖ్యం
- మున్సిపల్ యంత్రాంగం, కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేయాలి
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ దిశానిర్దేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : నాణ్యతతో రాజీ పడకుండా, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి, నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కాంట్రాక్టర్లకు సూచించారు. మంగళవారం ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నగర కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దామచర్ల పలు సూచనలు, ఆదేశాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టర్లు ఇబ్బందులను చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఒంగోలు నగర అభివృద్ధిలో కాంట్రాక్టర్లు, కార్పొరేటర్లు భాగస్వాములు కావాలని సూచించారు. మూడు నెలల్లో ఒంగోలు నగరం కొత్త హంగులు సంతరించుకోవాలని చెప్పారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలి, డ్రైనేజీలు, రోడ్లు పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. 70 మంది కాంట్రాక్టర్లు ఉన్నారని, 415 పనులకు టెండర్లు పిలిచారు. వాటిలో కొన్ని పనులు పూర్తయ్యాయని, మరికొన్ని పనులు జరుగుతున్నాయి, మరికొన్ని మిగతా 8లో







ఢిల్లీలోని పార్లమెంట్ కమిటీ హాలులో పట్టణ ప్రణాళికలో పర్యావరణపరంగా స్థిరమైన సాంకేతిక పద్ధతులపై గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఇతర కమిటీ సభ్యులు



## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### శాఖాధికారులు సమన్వయంతో పని చేయాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు, మేజర్‌న్యూస్ : క్షేత్రస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ఈ విషయంలో ఎంపీడీవోలు ప్రధాన పాత్ర పోషించాలని ఆమె చెప్పారు. ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఏపీఎంలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ మిగతా 8లో

## వైసిపి బురద రాజకీయాలు మానుకోవాలి

### జగన్‌రెడ్డి ఇంట్లో పడవలు తిరుగుతున్నాయా అని ఎద్దేవా

### రాష్ట్రాన్ని అన్నిరకాలుగా భ్రష్టు పట్టించిన వైసిపి పాలన

### రాష్ట్రం గురించి ఇప్పుడు ఆలోచించడం హాస్యాస్పదం

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, మేజర్‌న్యూస్: వైసిపి నాయకులు ఇప్పటికైనా ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలని, రెండు నెలల క్రితం ఇదే వైసిపి నాయకులు తల్లికి వందనం పథకం అమలు చేయలేదని నానా యాగి చేశారని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హితవు పలికారు. పట్టణంలోని జవహర్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు ఊబిలో ఉన్నా కూడా తన అపార అనుభవంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేశారని గుర్తుచేశారు. దాని తర్వాత అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదని బురద చల్లడానికి ప్రయత్నం చేశారని అన్నదాత సుఖీభవ పథకం అమలుతో రైతులు సంతోషం






వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎప్పుడూ బురద చల్లటమే పనిగా ఉన్న వైసిపి ఇప్పుడు రాజధాని అమరావతిలో పడవలు తిరుగుతున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని, రాజధాని అమరావతిలో ఉన్న జగన్ మోహన్‌రెడ్డి ఇంట్లో పడవలు తిరుగుతున్నాయా అని ప్రశ్నించారు. వినాశ పాలనతో రాష్ట్రాన్ని అన్ని రకాలుగా భ్రష్టు పట్టించిన వైసిపి నాయకులు ఇప్పుడు రాష్ట్రం గురించి ఆలోచించటం మిగతా 8లో

## లోకేష్ ఢిల్లీ పర్యటనతో మరింత అభివృద్ధి: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



దర్శి, మేజర్‌న్యూస్: ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి ఆజెండాగా గత రెండు రోజులుగా ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు పర్యటన ఎంతో మేలు చేస్తుందని దర్శి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నరలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ పారిశ్రామిక, ఆర్థిక, ఉపాధి అవకాశాలు పెంచేందుకు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడేందుకు ఢిల్లీ వెళ్లి పలువురు కేంద్రమంత్రులతో భేటీ అనంతరం అనేక ప్రాజెక్టుల కోసం కోరడం జరిగిందని చెప్పారు. రాష్ట్ర రైతులకు అత్యవసరంగా అవసరమైన యూరియా కొరత లేకుండా చూసేందుకు 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపునకు కేంద్రమంత్రి జేపీ నడ్డా నుంచి హామీ పొందారన్నారు. అదేవిధంగా బీపీసీఎల్ సంస్థ నిర్మించే రిఫైనరీ వేగవంతం దీపం 2 పథకాన్ని ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో అనుసంధానం చేయాలని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరిని కోరారని తెలిపారు. జీడి, మిర్చి, మిగతా 8లో

సూర్య
www.suryaa.com



# పంచాయతీరాజ్ అధికారులతో ఎమ్మెల్యే ఆనందబాబు సమీక్ష

భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: వేమూరు నియోజకవర్గ పరిధిలోని పంచాయతీరాజ్ అధికారులతో గుంటూరు క్యాంపు కార్యాలయంలో రివ్యూ సమావేశాన్ని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో వేమూరు నియోజకవర్గంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై శాసనసభ్యులు నక్కా ఆనందబాబు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పల్లె పండుగలో భాగంగా ఫేజ్-1, ఫేజ్-2లో బీటీ రోడ్లు,డొంక రోడ్లు కలిపి 174 పనులకు గాను రూ 51 కోట్లు శాంక్షన్ అయ్యాయని,వాటి పురోగతి గురించి అధికారులు



వివరాలు తెలియజేశారు.ప్రారంభమైన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆయన ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.అలాగే,నాబార్డ్ కింద 3 పనులకు రూ 3.2 కోట్లు మంజూరయ్యాయని, వాటిని తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.డి ఎం ఎఫ్ కింద 3 పనులు టెండర్ దశలో ఉన్నాయని,వాటి అంచనా వ్యయం రూ 3.3 కోట్లు అని తెలియజేస్తూ,టెండర్లను వెంటనే పూర్తి చేసి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. వేమూరు నియోజకవర్గం మొత్తం మీద 12 ప్రధాన పనులను గుర్తించామని, వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన నిధులు వచ్చే విధంగా కృషి చేస్తానని ప్రసన్న ఎమ్మెల్యే ఆనందబాబు తెలిపారు. ఈకార్య క్రమంలో సమావేశంలో వేమూరు నియోజకవర్గానికి చెందిన 5 మండలాల పంచాయతీరాజ్ డి.ఈలు,ఏ.ఈలు మరియు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



## క్షణాలను బంధించడమే ఫొటోగ్రఫీ : తహసీల్దార్ సలీమా

బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: పట్టణంలోని ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాపట్ల తహసీల్దార్ సలీమా, సీఐ రాంబాబు, రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాబు పాల్గొన్నారు. ముందుగా స్థానిక శ్రీ పొట్టి శ్రీరాములు ఏరియా వైద్యశాల లోని రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు, అనంతరం అసోసియేషన్ భవనంలో జరిగిన ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వవేడుకలలో ఫోటోగ్రాఫర్లకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ సలీమా మాట్లాడుతూ ఫోటోగ్రఫీ అనేది వేల జ్ఞాపకాలను, అనేక భావాలను పదిలించేస్తుంది అని అన్నారు. ఈ ఫోటోగ్రఫీ అనేది 19వ శతాబ్దంలోని మొదలైన ఈ కళ అనేక రూపాంతరాలు చెంది ఇప్పుడు ఈ డిజిటల్ యుగంలో ఎంతో పురోగతి సాధించిందని, అదేవిధంగా ఎంతోమందికి జీవనోపాధిగా ఉపయోగపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## ఐలవరం,అద్దేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది

భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: మండలం లోని ఐలవరం,అద్దేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి బి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ అధిక వర్ష సూచన కారణంగా వరి మరియు ఇతర పైర్లకు నష్టం వాటిల్లే పరిస్థితులు ఉన్నందున రైతులు అందరూ శ్రద్ధ వహించి,వరి పొలాల్లో మిగులు నీరు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా కలుపు విపరీతంగా పెరుగుతుంది కావున,వరి నారుమడి మరియు ప్రధాన పొలంలో కలుపు ఉధృతిని తగ్గించటం కోసం అంతర సాగు చేసుకోవాలని కోరారు. పార్థీనియం(వయ్యారి భామ) అవగాహన వారంలో భాగంగా, ఏఓ మాట్లాడుతూ వయ్యారిభామ పొలంలో కలుగ చేసే నష్టాలని,అది మానవుల ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో వివరి ంచారు. వయ్యారి భామ పెరగనీయ కుండా తగిన నివారణ చర్యలు తీసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు కారంకి లక్ష్మీ ప్రసన్న,వి.ఋష్,టి. అఖిల,వి.ఎ.ఎలు మహేంద్ర,ప్రవీణ్,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: ఎస్పీ

వేమూరు(భట్టిప్రోలు) మేజర్‌న్యూస్: రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో రోడ్డు భద్రతా సూచికలు కనిపించే విధంగా చర్యలు తీసుకోనేందుకు వేమూరు ఎస్సై శ్రీనివాసరావు శ్రీకారం చుట్టారు.మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం సమీపంలోని మలుపుల వద్ద వర్షాల కారణంగా చెట్లు విరివిగా పెరిగి ప్రమాద సూచిక బోర్డులు కూడా కనిపించకుండా ఉండటం తో తరచుగా మలుపుల వద్ద పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈనేపధ్యంలో ఆయా ప్రాంతాల్లో విరివిగా పెరిగిన చెట్లను జెసిబి ద్వారా తొలగించి ప్రయాణికులకు రోడ్డు సూచికలు కనిపించి సుఖవంత ప్రయాణం జరిగే విధంగా జిల్లా ఎస్పీ గారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు.అందులో భాగంగా పోలీస్ సిబ్బంది రెండు మలుపుల వద్ద ఇరువైపులా ఉన్న రోడ్డుపై చొచ్చుకు వచ్చిన చెట్లను తమ సొంత ఖర్చులతో తొలగించారు. అదేవిధంగా తెనాలి-కొల్లూరు మెయిన్ రోడ్డు పరిసరాల్లో జంపని చెరువు మలుపు వద్ద కూడా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ ఐ తెలిపారు.పోలీసులు చేస్తున్న చర్యలను పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం



రేపల్లె, మేజర్‌న్యూస్: డిగ్రీ ఆన్లైన్ ప్రవేశాలకు ఈ నెల 20వ తేది నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం చనున్నట్లు స్థానిక శ్రీ ఏ బి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.సి. రవిచంద్రకుమార్ మంగళవారం తెలిపారు. కళాశాలలో సైన్స్ విభాగంలో బి.యస్సీ (కంప్యూటర్ సైన్స్), బి.యస్సీ (కెమి స్ట్రీ), బి.యస్సీ (ఫిజిక్స్) బి.యస్సీ (జువాలజీ) కోర్సులు ఆర్ట్స్ విభాగంలో బి.ఎ (హిస్టరీ), బి.ఎ (ఎకనామిక్స్), బి.కామ్ (జనరల్) బి.కామ్ (కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులు అందుబాటులో వున్నాయని తెలియజేసినారు. ఇటీవలే ఏర్పాటుచేసిన అధునాతన కంప్యూటర్ లాబ్ కళాశాలకు ప్రత్యేక ఆకర్షణ అని తెలియజేసినారు. కళాశాలలో ఎన్ .సి.సి, ఎన్ .ఎస్.ఎస్. రెడ్ క్రాస్ రింగ్ అనుబంధ విభాగాలు విద్యార్థులకు తగిన సేవలు అందించుటకు అందుబాటులో వున్నాయని తెలిపారు. కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే గుర్తింపు పొందిన ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ వుండటం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ తెలియజేసినారు. ఈ సంస్థ ద్వారా విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ స్కిల్స్, ఎనలిటికల్ స్కిల్స్ ఆంగ్ల భాషలో నైపుణ్య కోర్సులు అం దిస్తున్నారని తెలిపారు. కళాశాలలో అధ్యాపకుల నైపుణ్యతకు, ల్యాబ్ నిర్వహణకు గాను కళాశాలకు ప్రత్యేక గుర్తింపుగా ఏ ప్లస్ (3.28) గ్రేడ్ ను న్యాక్ వారు అందజేశారని తెలిపారు. ఈ గుర్తింపుకు అనుగుణంగా గత సంవత్సరం నుంచి కళాశాల స్వయంప్రతిపత్తి పొందటం గర్వకారణమని ఒక ప్రిన్సిపాల్ తెలి పారు.కాబట్టి ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులందరూ 20వ తేది నుంచి జరగబోయే ఆన్లైన్ అడ్మిషన్ ప్రక్రియలో పేర్లు నమోదు చేసు కొని, అడ్మిషన్ పొందగలరని ప్రిన్సిపాల్ తెలిపారు.

## సిపిఎం అభిమాని మృతికి నివాళి

రేపల్లె, మేజర్‌న్యూస్: రేపల్లె ప్రాంత సిపిఎం అభిమాని బోయపాటి. సీతారామయ్య (87) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు ఆయన మృతదేహంపై రేపల్లె పట్టణ కమిటీ నేతలు పార్టీ జెండా కప్పి జోహార్లు తెలిపారు. జగన్ కాలనిలో ఆయన నివాసం వద్ద సిపిఎం నేతలు జండా కప్పి పూలమాలవేసి నివాళులు తెలిపారు.ఈ సందర్భంగా సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్. మణిలాల్ మాట్లడుతూ సుదీర్ఘ కాలం పాటు రేపల్లె సిపిఎం ఆఫీస్ లో నివాసం ఉంటూ గతంలో సిపిఎం నిర్వహించిన అనేక పోరాటాల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడు,సిపిఎం అభిమానిగా ఆరోగ్యం సహకరించిన అంతకాలం నిరంతరం పాల్గొన్నారని తెలిపారు. పార్టీ ప్రచార కార్యక్రమాల్లో నమ్మిన కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం కోసం సమ సమాజం కోసం భుజం



మీద సిపిఎం జెండాతో కరపత్రాలు పంచుతూ క్రమశిక్షణగా ఉండేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కేవీ లక్ష్మణరావు కె రమేష్, డి.ఆగస్టీన్ ,కె. సాయిప్రసాద్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

దొనకొండ, మేజర్‌న్యూస్: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతున్నాయని సిపిఐ దొనకొండ మండలం కార్యదర్శి సిహెచ్ గురుమూర్తి తెలిపారు మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ ఆగస్టు 20వ తేదీ నుండి 25 వరకు రాష్ట్ర మహాసభలు జరుగుతాయని 23వ తేదీన శ్రమజీవుల శంఖారావం పేరుతో ప్రజాప్రదర్శన బహిరంగ సభ జరుగుతుందని ఈ మహాసభకు వేలాదిగా ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. దొనకొండను పారిశ్రామిక కారిడారుగా అభివృద్ధి చేస్తామని చెప్పి పాలకులు పబ్బం గడుపుకుంటున్నారు. తప్ప ఆ



వైపుకు ఆలోచన కూడా చేయటం లేదని ఒక్క పరిశ్రమకు కూడా శంకుస్థాపన చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. ఈ మహాసభల జయప్రదం చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.కరుణానిధి, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కురేటి బాలయ్య, దొనకొండ మండల నాయకులు బి.మరియదాసు, నాళి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



## 792 పొగాకు బేళ్లు అమ్మకాలు

టంగుటూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని టంగుటూరులో మంగళవారం జరిగిన పొగాకు వేలం కేంద్రంలో వివిధ గ్రామాల నుండి 949 పొగాకు బేళ్లు వేలంనకు రాగా అందులో 792 పొగాకు బేళ్లు అమ్మకాలు జరిగినట్లు వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. టంగుటూరు, జరుగుమల్లి, సాదువారిపాలెం, వావిలేటిపాడు గ్రామాలకు చెందిన రైతులు, 949 పొగాకు బేళ్ల వేలమునకు తెచ్చినట్లు తెలిపారు. అందులో 792 పొగాకు బేళ్లు అమ్మకాలు జరగగా అత్యధిక ధర రూ.281లు కాగా అత్యల్ప ధర రూ.140లు ధర పలికినట్లు వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.



## విద్యార్థులకు డిపిటి టీకాలు

తాళ్లూరు, మేజర్‌న్యూస్: మండలంలోని వెలుగువారిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల కలిగే నిమోనియా, కోరింత దగ్గు, ధనుర్వాతం లాంటి వ్యాధుల నుండి నివారణకు డిపిటి టీకాలు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వేయడం జరిగింది. గతంలో ఈ ఇంజక్షన్ తల్లిదండ్రులు వారి పిల్లలను హెల్త్ క్లినిక్ వద్దకు తీసుకువెళ్లి చేయించుకునేవారు ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వము హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాఠశాలల వద్దకే వచ్చి విద్యార్థులకు ఇంజక్షన్లు వేయించే కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ప్రవేశపెట్టింది. కార్యక్రమం లో ఏఎన్ఎం సుజాత, ప్రధానోపాధ్యాయులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, ఆశావర్కర్లు అంజమ్మ, శ్రీదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 22న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం

అద్దంకి,మేజర్‌న్యూస్: సింగరకొండ పై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 22వ తేదీ శుక్రవారం మహిళలకు ప్రీతి కరమైన వరలక్ష్మీ వ్రతములు జరుగునని ఈఓ మద్దినేని శ్రీనివాసరావు తెలిపారు. మహిళలు అందరూ ఉదయం 9:00 గంటలకు దేవస్థానం వద్ద కు వచ్చి వ్రతములో పాల్గొనవలసినదిగా ఆయన కోరారు. పూజకు కావలసిన సామాగ్రి దేవస్థానం వారు ఏర్పాటు చేస్తుందని, కలశమునకు చెంబు మాత్రం మహిళలు తెచ్చుకోగలరు. ఆలయ చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, కార్యక్రమములో భక్తులు పాల్గొ ని స్వామివారి కృపకు పాత్రులు కావలసినదిగా కోరారు.

# రైతులకు సకాలంలో ఎరువులను సరఫరా చేయాలి

## ఎరువుల సరఫరాలో పొరపాట్లకు తావులేకుండా పర్యవేక్షించాలి - జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఈ ఖరీఫ్ సీజన్లో జిల్లాలో ఎరువుల సరఫరాలో ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా, రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో సరఫరా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా వ్యవసాయ మరియు దాని అనుబంధ శాఖల అధికారులతో సమావేశమై ఆయా శాఖల ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాల పురోగతిపై, తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో జిల్లాలో ఎరువుల సరఫరాలో ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా, రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో సరఫరా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధిరేటే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకొని అందుకనుగుణంగా లక్ష్య సాధనకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతుకు ఖర్చు తగ్గించి, ఉత్పత్తి పెంచేలా తదనుగుణంగా అధిక ఆదాయం పొందేలా వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. పశుగ్రాసం పంపిణీ, పశు భీమా లక్ష్యాలపై ప్రత్యేకదృష్టి సారించి నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లాకలెక్టర్, పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు, పశుసంవర్ధకశాఖ జెడి రవికుమార్, మత్స్య శాఖ జెడి శ్రీనివాస రావు, పకృతి వ్యవసాయ అధికారి సుభాషిని, మార్క్ఫెడ్ అధికారి హరికృష్ణ, జిల్లా సెరికల్చర్ అధికారి సుజయ్, ఏపిఎంఐపి పిడి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ, దాని అనుబంధ శాఖల క్షేత్రస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.





### తలమల్ల, ఉప్పలపాడు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

పొదిలి, మేజర్‌న్యూస్: మండలంలోని తలమల్ల, ఉప్పలపాడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల వ్యవసాయ శాఖ అధికారి దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి వరి పంటలో ఉల్లికోడు తీవ్రత వరిలో ఎక్కువగా ఉందని, దాని నివారణకు ఒక ఎకరానికి కార్బోఫ్యూరడాన్ 3జి గుళికలు ను 10 కేజీలు చొప్పున వాడాలన్నారు. ఈ పంట సాగు హక్కు పత్రాలను పొందడం కోసం గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలన్నారు. కౌలు కార్డు .ఈ పంట నమోదు చేసుకోవడం వల్ల అతివృష్టి అనావృష్టి సమయం లలో పంట నష్టపరిహారం, పం పండించిన పంటలను మద్దతు ధరకి అమ్ముకోవడానికి, సబ్సిడీ ద్వారా విత్తనాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

### సొసైటీ అధ్యక్షులు ఎర్రంరెడ్డిని సన్మానించిన టిడిపి నాయకులు

పొదిలి, మేజర్‌న్యూస్: మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షులుగా నియమితులైన ఎర్రం రెడ్డి వెంకటేశ్వర రెడ్డిని మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రోశ్శ శ్రీను, మాజీ వార్డ్ సభ్యులు వెలుగోలు వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు పూలమాలవేసి ,శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.



# వారం రోజుల్లో సాగర్, బుగ్గ చలం అక్రమ నీటి కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలి

## నగర పంచాయతీ కమిషనర్ కేవిల్ నారాయణరెడ్డి



పొదిలి, మేజర్‌న్యూస్ : నగర పంచాయితీ నందు అక్రమంగా ఉన్న సాగర్, బుగ్గచలం నీటి కుళాయి కనెక్షన్లు వారం రోజుల్లోపు క్రమ బద్దీకరించు కోవాలని నగర పంచాయతీ కమిషనర్ కేవిల్ నారాయణరెడ్డి కోరారు. సాగర్, బుగ్గ చలం కులాయి క్రమబద్ధీకరణ మరియు నూతన కనెక్షన్స్ మంజూరు చేయుటకు ప్రస్తుతం రూ: 10,500లు వసూలు చేయడం జరుగుతుందన్నారు.. సదరు కుళాయి ఫీజు తగ్గించ వలసినదిగా పట్టణ ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తి మేరకు మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణ రెడ్డి ఆదేశముల మేరకు సదరు కుళాయి రుసుము మొత్తమును రూ: 6 వేలకు తగ్గించడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని నగర పంచాయతీ ప్రజలు గమనించి సాగర్, బుగ్గ చలం అక్రమ కనెక్షన్ కలిగిన వారు వారం రోజుల్లో నగదు చెల్లించి క్రమబద్దీకరించుకోవాలని కోరారు. వారం రోజుల లోపు అక్రమ మంచినీటి కుళాయి కనెక్షన్ లను క్రమబద్ధీకరించుకుంటే ఎలాంటి నోటీసులు లేకుండా తొలగించడం జరుగుతుందని నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డి హెచ్చరించారు.

# ఘనంగా బొల్లా నరసింహారావు జన్మదిన వేడుకలు



పామూరు, మేజర్‌న్యూస్: టిడిపి యువ నాయకుడు లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు జన్మదిన వేడుకలు మంగళవారం సాయంత్రం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో అంగరంగ వైభవంగా జరిగాయి. వేడుకల్లో టిడిపి పామూరు మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు పాల్గొని కేక్ కట్ చేసి నరసింహారావుకు తినిపించారు. శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహారావు పార్టీ పట్ల అంకిత భావంతో పని చేస్తున్నారు. ఆయన లాంటి నాయకులు ఉండడం మండలానికి గర్వకారణం అని అన్నారు. జన్మదిన వేడుకలు కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, సయ్యద్ అమీర్ బాబు,పువ్వాడి వెంకటేశ్వర్లు బిల్డర్,పువ్వాడి రామారావు, ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, ఆరికొంద హరిప్రసాద్, నొస్సం నాగేంద్ర చారి, షేక్ గౌస్ బాషా, ఇర్రి కోటిరెడ్డి,పాలపర్తి వెంకటేశ్వర్లు, ఆకుపాటి వెంకటేష్, షేక్ గౌస్ బాషా, దోల శేషాద్రి, మన్నం రమణయ్య, కోటపాటి నరసింహా రావు,కొండిశెట్టి వెంకటరమణయ్య, ఎల మండల రహీముల్లా, దర్శి ఏడుకొండలు, సంధాని, మార్నేని రామకృష్ణ, దయండే శివశంకర్, గుత్తి మహేష్, మండ్లా రమణయ్య, షేక్ కాజా రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

### నేటి విస్తృతస్థాయి సమావేశానికి తరలిరండి

సంతమాగులూరు మేజర్‌న్యూస్: మండలంలోని పుట్ట వారి పాలెం అడ్డ రోడ్డు నందు ఉదయం 11 గంటలకు స్థానిక వాసవి కళ్యాణమ మండపం నందు మండల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వైసీపీ కన్వీనర్ ఊట్ల నాగేశ్వరరావు తెలిపారు ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి వైసీపీ నాయకులు కార్యకర్తలు, తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే అంశాన్ని ఎజెండాగా తీసుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వాన్ని రీ కాల్ చేయాలనే ధ్యేయంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అద్దంకి వైసిపి ఇన్చార్జ్ పానేం చిన్న హనీమిరెడ్డి వివిధ మండలాల వైసీపీ కన్వీనర్లు పాల్గొంటారని ఆయన తెలిపారు.

# టిడిపి సభ్యత్వం ఫలితం

## సుజాతకు రూ.5లక్షల ఇన్సూరెన్స్ సహాయం



పామూరు, మేజర్‌న్యూస్: టిడిపి సభ్యత్వం తీసుకోవడం వల్ల లభించిన ప్రమాద భీమా కింద లక్ష్మీ నర్సాపురం గ్రామానికి చెందిన వేముల నివాస్ భార్య సుజాతకు ఐదు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సహాయం అందింది. ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సహకారంతో జాతీయ టిడిపి అధ్యక్షుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈ సహాయం అందించబడింది. ఈ చెక్కును టిడిపి పామూరు మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, లక్ష్మీ నర్సాపురం ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు సుజాతకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి నాయకులు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, పామూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాబు, బూత్ ఇంచార్జి ఇల్లూరి శ్రీనివాసులురెడ్డి, టిడిపి నాయకులు గవిరెడ్డి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరాచూరి పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన సి.ఎస్.పురం పట్టణంలోని వి.ఆర్. నగర్ ప్రాంతం నందు వెలసిన మహిమాన్విత భక్తుల కొంగుబంగారం శ్రీరాచూరి పెద్దమ్మతల్లి దేవస్థానం నందు శ్రావణమాసం మంగళ వారం సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం అర్చకులు గురుచెన్నకేశవులుస్వామి అధ్వర్యంలో పెద్దమ్మతల్లి అమ్మవారికి పంచామృత అభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ఇతర దేవతామూర్తులను పట్టు వస్త్రాలు పూలమాలలతో అలంకరణ చేసి కుంకుమార్చన ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలుచేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానికులు పరిసర గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

### అదనపు బస్సు కోసం మార్కాపురం డిపో డియం నరసింహులుకు వినతి



తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన మార్కాపురం నుండి తర్లుపాడు మీదుగా కంభం, మార్కాపురం నుండి తర్లుపాడు మీదుగా తాడివారిపల్లి గ్రామంకు అలాగే కనిగిరికి ఆధనంగా బస్సులు నడపాలని తర్లుపాడు జనసేన నాయకులు మార్కాపురం డిపో డియం నరసింహులుకు, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తర్లుపాడు సొసైటీ చైర్మన్ వెలుగు క్రాంతికుమార్, జనసేన నాయకులు సిద్ధం కృష్ణవేణి, మిర్యాల వాసవిప్రియ, గంజరపల్లి మహేష్, పఠాన్కరీముల్లా, గుంటు మోషే, కొండెబోయిన సునీల్, ముప్పా సురేష్, వన్నెబోయిన వెంకటేష్, సయ్యద్ రఫీ పాల్గొన్నారు.

### సీఎం కార్యాలయ కో-ఆర్డినేటర్ మంతెనకు శుభాకాంక్షలు బీసీ సెల్ నాయకులు



పొదిలి, మేజర్‌న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కార్యాలయ కో ఆర్డినేటర్‌గా నియమితులైన, మంతెన వెంకట సత్య నారాయణను మంగళవారం రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేష్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు పూల మాల వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొంది ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు.


సూర్య www.suryaa.com





## ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కలిసిన క్రాంతికుమార్

తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండల సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వెలుగు క్రాంతి కుమార్ మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని మర్యా దపూర్వకంగా కలిసి పూల మాల, శాలువాతో సత్కరించా రు. తన మీద నమ్మకంతో సొసైటి చైర్మన్‌గా నియమించి నందుకు ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండల అధ్య క్షులు సిహెచ్ శ్రీనివాసులు, జనసేన నాయకులు సిద్దం కృష్ణవేణి, మిర్యాల వాసవి, గంజరపల్లి మహేష్, గుంటు మోషే, పఠాన్ కరీముల్లా, కొండెబోయిన సునీల్, ముచ్చా సురేష్, వన్నెబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

మార్టూరు, మేజర్‌న్యూస్: ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫారసు మేరకు చికిత్స కొరకు లెటర్ ఆఫ్ క్రెడిట్ ఎల్‌వోసి ద్వారా పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన షేక్ జుల్ఫికర్ అలీ భుట్టో 1,00,000, ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన గర్నపూడి మేఘన 1,75,000 పర్చూరు మండలం పర్చూరు గ్రామానికి నాగళ్ళ దివ్య జ్యోతి 1,75,000 యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన గన్నమనేని వెంకటరత్నం 70,000 ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు నాయకులు, క్యాంపు కార్యాలయం ప్రతినిధులు చెక్‌ను అందజేశారు.



## సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు: ఎమ్మెల్యే

ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని కరేడు, అలగాయపాలెం సచివాలయాల్లో కందుకూరు నియోజ కవర్గం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మంగళ వారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసేవలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఉద్యోగులను హెచ్చరిం చారు. సచివాలయాల్లో అటెండెన్స్, మూవ్‌మెంట్ రిజిస్టర్ లను పరిశీలించారు. విధులకు ఎంతమంది హాజర య్యారు. అనుమతి లేకుండా బయటకు వెళ్లిన సిబ్బంది ఎవరు అనే వివరాలను క్షుణ్ణంగా ఆరా తీశారు. విధుల్లో లేని సిబ్బంది ఎక్కడికి వెళ్లారనే దానిపై అక్కడికక్కడే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసు కున్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడి, సచివాలయంలో అందుతున్న సేవల గురించి, సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడారు. వీలైనంత త్వరగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

# అప్పుల రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న ముఖ్యమంత్రి

- తీర ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక ఎమ్మెల్యే ఇంటూరి
- 2.45 కోట్లతో నూతన బీటీ రోడ్డుకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే





ఉలవపాడు, మేజర్‌న్యూస్: అప్పుల ఊబిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిం చే సత్తా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే ఉందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వ రరావు తెలిపారు. నియోజకవర్గంలోని తీర ప్రాంత అభి వృద్ధికి పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని ఆయన స్పష్టం చేశారు. మండలంలోని కరేడు పంచాయ తీలో నాబార్డ్ నిధులు 2.45 కోట్లతో కరేడు ర్యాంపు నుండి రామాయపట్నం వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ రోడ్డు నిర్మించిన దాఖలాలు లేవని రోడ్లపై ప్రయాణించా లంటే ప్రజలు నరకయాతన అనుభవించారని,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక,ప్రజల ప్రయాణ సౌక ర్యార్థం రోడ్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత ప్రభుత్వం చిన్నా భిన్నం చేసినప్పటికీ,చంద్రబాబు నాయుడు అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి,సంక్షేమంలో ప్రథమ స్థానంలో నిలపడానికి నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని, మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం,రైతుల కోసం అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథ కాలను ఇప్పటికే అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. ముందుగా ఎమ్మెల్యేకు కరేడు గ్రామస్థులు, నాయకులు ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బా రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నేలటూరి ఆదాము, నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, రాంబాబు, మెట్ల శ్రీనివాసరెడ్డి, జెట్టి సుబ్బరామిరెడ్డి, బాల మురళి, వాయల శీను, వెంకట్రామిరెడ్డి, బెల్లం కృష్ణమోహన్, సుదర్శి శ్రీను, బ్రహ్మారెడ్డి, అమరనేని హరిబాబు, అమ్మనబ్రోలు రమేష్, మండలంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ తల్లి తిరునాళ్లలో ఎమ్మెల్యే బి.ఎన్ విజయ్‌కుమార్



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని పేర్నమిట్టలో మంగళవారం ప్రారంభమైన పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ వేడుకల్లో సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అర్చకులు లక్ష్మణాచారి ఆధ్వర్యంలో పోలేమ్మ తల్లికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ పూజలో పాల్గొన్నారు. ఈనెల 19,20 తేదీల్లో గల రెండు రోజులు పాటు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ వేడుకలు ఘనంగా జరుగుచున్నవి. 19న మంగళవారం మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నదాన వేడుకలు నిర్వహించారు. మంగళవారం రాత్రి పోలేరమ్మ తల్లికి విద్యుత్ ప్రభ ద్వారా వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరు వెంకటేశ్వరరావు అలియాస్ బాబు, మాజీ ఎంపీపీ వివరం గోవిందు, మాజీ వైస్ ఎంపీపీ. టిడిపి నేత వాసేపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, పేర్నమిట్ట మాజీ ఉపసర్పంచ్ టిడిపి నేత కరిచేటి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కందుకూరి మల్లికార్జున రావు, పోలేరమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తన్నీరు వెంకట్రావు, వెంకటేశ్వర్లు, రామారావు, చెంచయ్య, లింగాలు, అంకమరాజు తదితరులు పాల్గొన్నారు. పేర్నమిట్ట పోలేరమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుచున్నవి.

# సూర్య ఘర్ పథకంలో రుణాల జాప్యం



చీరాల, మేజర్‌న్యూస్: సూర్యఘర్ పథకంలో బ్యాంకుల రుణాలు ఆలస్యం అవుతున్నాయని విద్యుత్ శాఖ సి.ఎం.డి పుల్లారెడ్డి తెలిపారు. బాపట్ల సర్కిల్ కార్యాలయంలో మంగళవారం స్థానిక బాపనమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.విద్యుత్ సరఫరా వ్యవస్థపై విస్తృతంగా సమీక్షించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడం మా ప్రధాన లక్ష్యం. ఎక్కడా లో వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షిస్తు న్నాం. బాపట్ల పరిధిలో కొత్తగా మూడు సబ్‌స్టేషన్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇవి పూర్తికాగానే విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా ఉంటుంది అని చెప్పారు. గత మూడు నెలల్లోనే జిల్లాలో 1500 వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చామని, మిగిలిన పనులు వందశాతం పూర్తి చేయా లని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ప్రస్తుతం 204 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని గుర్తుచేశారు. సూర్యఘర్ పథకంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచిత సౌక ర్యాలు వచ్చే నెల నుంచే అందించేలా చర్యలు చేపడు తున్నాం అని పుల్లారెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావే శానికి అన్ని స్థాయిల్లోని అధికారులు హాజరయ్యారు.

# 26వ రోజు కామాక్షి అమ్మవారి శ్రావణమాస పూజలు



భట్టిప్రోలు,మేజర్ న్యూస్: మండల కేం ద్రం భట్టిప్రోలు శ్రావణ మాసం 26వ మంగళ వారం మద్దుల శ్రీనివాసు-అంక సరస్వతి దంపతుల గృహములో శు క్రవారోత్సవ కమిటీ ప్రధాన నిర్వాహకురాలు బూర్లె అరుణకుమారి ఆధ్వర్యంలో కామాక్షి అమ్మవారి అర్చన మరి యు పాదారవింద శతకం పారాయణ తదుపరి సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ కామాక్షి దేవి అయిదు రూపాయల లో కొలువై ఉండా రని,గాయత్రీ మండపంలో ఉన్న దేవి మూల దేవతగా నాలుగు గోడలు 4 వేదాలుగా, 24 స్తంభాలు గాయత్రి మంత్రంగా,24 అక్షరాలు గాయత్రి మంత్రంగా, 24 అక్షరాలుగా భావి స్తారనీ,అమ్మవారిని కామాక్షి, స్వర్ణ కామాక్షి, అంజన కామాక్షి,ఉత్సవ కామాక్షి,అనే నాలుగు రూపాల్లో కొలువై ఉన్నారని అరుణకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాటూరు స్వరూ ప, మటూరు గృహలక్ష్మి,దర్శి శశికళ, బి సుజాత, బూర్లె హేమ పద్మ, ధనలక్ష్మి, సూర్యప్రభ, శ్రీదేవి, రాజ్యలక్ష్మి, మాలతి, లలిత,అనురాధ,కమిటీ సభ్యులు మరియు భక్తుల పాల్గొన్నారు.



## ఉత్తమసేవా పురస్కార గ్రహీత ఎస్‌టిఓ ఖాదర్ భాషాకు సన్మానం

అద్దంకి, మేజర్‌న్యూస్: స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టర్, జిల్లా మాజిస్ట్రేట్ జె. వెంకటమురళి చేతుల మీదుగా అద్దంకి యస్.టి.ఓ యస్.కె. అబ్దుల్ ఖాదర్ భాషా ఉత్తమసేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం-బాపట్ల జిల్లా-2 కోశాధికారి పుట్టంరాజు శ్రీరామచం ద్రమూర్తి మంగళవారం ఉదయం ట్రెజరీ కార్యక్రమంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వి. సునీత, కె. శ్రీనివాస్, బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టిటిసి థియరీ పరీక్ష ఈనెల 24న

బాపట్ల, మేజర్‌న్యూస్: టెక్నికల్ టీచర్ కోర్స్ (లోయర్ గ్రేడ్) థియరీ పరీక్షలు ఈనెల 24న ఆదివారం ఉదయం గం 11:00 నుండి సాయంత్రం గం 4:30 వరకు జరగ నున్న ట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ పట్నం, కాకినాడ, గుంటూ రు, వైయస్సార్ కడప, అనంత పురం జిల్లాలలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాలలో నిర్వహించబడతాయి. 19 నుండి హాల్ టికెట్స్ అధికారిక వెబ్సైట్ https://www. bse. ap. gov.inలో అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యర్థులు ధ్రువీకరణ కోసం హాల్ టికెట్‌తో పాటు ఫోటో గుర్తింపు కార్డు పాస్‌పోర్ట్, పాన్ కార్డ్, ఓటర్ ఐడి, ఆధార్ కార్డు, వంటి ఒక ధ్రువీకరణ గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరుకావాలని కోరారు.






# 'ఉల్లాస్-అక్షర ఆంధ్ర అక్షరాస్యతా'పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## జిల్లాస్థాయి అధికారుల శిక్షణలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఉల్లాస్–అక్షర ఆంధ్ర అక్షరాస్యతాపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశించారు. ఉల్లాస్–అక్షర ఆంధ్ర అక్షరాస్యతా కార్యక్రమంపై ఒంగోలు కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్. యస్ హాలులో జిల్లా జిల్లా అధికారుల సమక్షంలో ఎం.పి.డి.ఓ, ఎం.ఇ.ఓ, డి.ఆర్.డి.ఎ–ఎ.పి.యం., డి.డబ్ల్యు.యం.ఎ–ఎ.పి.ఓ., నగరపాలక కమీష నర్లు, సిటీ మిషన్ మేనేజర్లకు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఉల్లాస్– అక్షర ఆంధ్ర అక్షరాస్యతా కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. దీనికి సంబందించి సంబంధిత జిల్లా అధికాలందరూ తమ సహకారం, తోడ్పాటు అందించాలని కోరారు. 15–59 సంవత్సరాల మధ్య నిరక్షరాస్యులైన వయోజనులకు ఉద్దేశించిన సాంకేతికత, వయోజన విద్య అందు బాటులోకి తెచ్చే కార్యక్రమమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో స్వచ్ఛంద బోధకులుగా కనీసం 10వ తరగతి విద్యార్హత గల వారు ఎవరైనా సరే 10 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయవల్సి ఉంటుందని చెప్పారు. ఇది స్వచ్ఛందంగా జరిపే కార్యక్రమని తెలియజేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ బి. వెంకాయమ్మ మాట్లాడుతూ నిరక్షరాస్యులైన యస్.హెచ్.జీ మహిళలకు ఉల్లాస్–అక్షర ఆంధ్ర అక్షరాస్యతా కార్యక్రమం ఒక వరమని పేర్కొన్నారు. జెడ్.పి, సి.ఇ.ఓ, ఎం.పి.డి.ఓలకు, డి.ఆర్.డి.ఎ, పి.డి, ఎ.పి.యంలకు, మెప్మా పి.డి, సి.యం.యం, సి.ఓ, ఆర్.పిలకు, డ్వామా పి.డి, ఎ.పి.ఓలకు, డి.ఇ.ఓ, ఎం.ఇ.ఓలకు ఉల్లాస్–అక్షర ఆంధ్ర అక్షరాస్యతా కార్యక్రమం గ్రామ స్థాయిలో విజయవంతం అగుటకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు బి.జగన్మోహన రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారులు, గణాంక అధికారి తదితరులు పాల్గొన్నారు.

# భీమలింగేశ్వరస్వామి దేవాలయం చైర్మన్‌గా జాగర్లమూడి సుబ్బారావు



పంగులూరు, మేజర్‌న్యూస్: దేవాలయాలకు పూర్వ వైభోగం రావాలన్నా గ్రామస్తుల సహాయ సహకారాలతోనే సాధ్యపడుతుందని ఏరియా ఇన్స్పెక్టర్ ఎం వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం పంగులూరులోని శ్రీ భీమలింగేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో మేడ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో ఏరియా ఇన్స్పెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, ఈవో శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నూతన పాలకమండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. కమిటీ చైర్మన్ జాగర్లమూడి బుచ్చియ్య ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వడ్డీ వెంకట శ్రీరామప్రసాద్, కట్ట మల్లేశ్వరి, దేవరకొండ ముత్యాలమ్మ, పి.మల్లికసాయి సుధా, కనకాల సుందరమ్మ, గుడిపాటి వెంకటేశ్వర్లు, కొల్లా పద్మ, టి రవీంద్ర, కారంచేటి సాంబశివరావులు బోర్డు మెంబర్లుగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏరియా ఇన్స్పెక్టర్ ఎం వెంకటే శ్వర్లు మాట్లాడుతూ దేవాలయానికి ధర్మకర్త సభ్యులు, అర్చకులు సహాయ సహకారాలతో వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆలయ అభివృద్ధికి తీసుకునే పని నిబంధనలకు లోబడి ఉండాలని, పని అవుతుందా అవ్వదా అనే నిర్ణయం కమిటీ సభ్యులతో చర్చలు జరపాలన్నారు. ఈవో శ్రీనివాసరావు మాలకొండ, సింగరకొండ క్షేత్రాలలో నిబంధనలతో పనిచేసి ఆలయాల అభివృద్ధికి తోడ్పటునందించారని అదేవిధంగా శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధికి కమిటీ సభ్యుల తోనూ, గ్రామస్తుల సహాయసహకారంతో అభివృద్ధికి తోర్పడతానన్నారు. కీర్తిశేషులు బాచిన నాగేశ్వర రావు జ్ఞాపకార్థం జనవరిలో జరిగే ఉత్సవాలకు, అభివృద్ధి పనులకు లక్షన్నర నుండి రెండు లక్షల రూపాయల వరకు ఖర్చు చేస్తామని మండల నాయకులు రావుల రమేష్ బాబు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు కుక్కపల్లి ఏడుకొండలు, రోటరీ క్లబ్ అధ్యక్షులు బత్తుల వీరనారాయణ, చింతల సహదేవుడు, ధూళిపాల నారాయణస్వామి, జి.ఆదిరెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు కె వి సుబ్బారావు, చిలుకూరి కోటయ్య గ్రామ సెక్రెటరీ బి రాంబాబు, గ్రామపెద్దలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు స్వామి దాసుని కలసిన జగన్‌పాల్



గిద్దలూరు, మేజర్‌న్యూస్: కల్వరి ప్రసన్నత మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ జగన్‌పాల్ గుంటూరు టిడిపి కార్యాలయంలో టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటి స్వామి దాసుని మర్యాదపూర్వకముగా కలవడం జరిగింది. గిద్దలూరు నియోజకవర్గంలో ఉన్నటువంటి క్రైస్తవ సమస్యలను గురించి వివరించి, లిఖిత పూర్వకముగా అందించారు. ముఖ్యంగా సమాధుల తోట, కాంపౌండ్ వాల్, మ్యారేజ్ లైసెన్స్, చర్చిల మరమ్మత్తులు, సువార్త ప్రకటించుట కొరకు ఎటువంటి అభ్యంతరము లేకుండా ప్రభుత్వాన్ని కోరాలని విన్నవించుకున్నారు. క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు స్వామి దాసు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం క్రైస్తవుల సమస్యలలో ముందుండి పరిష్కరించి సహాయం చేయుటలో తోడ్పడుతుందని, త్వరలో పాస్టర్స్‌కి గౌరవేతనము విషయంలో క్రొత్తవారికి అవకాశం ఉంటుందని తెలియజేశారు.

# ఒంగోలులో అనుమతుల్లేని లేఅవుట్లపై దృష్టి సారించాలి

## జేసికి విన్నకోట సురేష్ బృందం వినతి



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఒంగోలు నగర పరిధిలో అనుమతులు లేని లే అవుట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణకి ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విన్నకోట సురేష్ బాబు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అసోసియేషన్ సభ్యులతో కలిసి జేసిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేసి వివరించారు. జేసిని కలిసిన వారిలో రాష్ట్ర జనరల్ సెక్రెటరీ స్వర్ణ అనిల్ కుమార్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రవికుమార్, బాపట్ల జిల్లా అధ్యక్షులు రావిపాటి విష్ణువర్ధన్‌లు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లాకు దుగ్గిరాల పేరు పెట్టాలి

చీరాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోన చీరాల మసీదు సెంటర్లో బాపట్ల జిల్లాను దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జిల్లాగా పేరు మార్చాలని అదేవిధంగా చీరాలను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చీరల కేంద్ర జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ ఆగస్టు 29వ తారీఖున బాపట్ల కలెక్టర్ ఆఫీస్ నందు అర్జీలు స్వీకరించడానికి జిల్లాల పునర్విభజన మంత్రుల సంఘం రానున్నది కావున చీరాలను జిల్లా కేంద్రంగా చేస్తూ బాపట్ల జిల్లాకు ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలి అనేటటువంటి నినాదంతో చీరాలలో ఉండేటువంటి అన్ని రాజకీయ పార్టీలు, వ్యాపార సంఘాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ సంఘాలు, వివిధ రకాల సంఘల నాయకులందరూ కలిసి వచ్చి 29వ తారీఖున కలెక్టర్ ఆఫీసులో చీరాల ఆకాంక్షను అర్జీల రూపంలో తెలియ పరచవలసినగా పిలుపునిచ్చారు.

# మెడికల్ కళాశాలలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమం మంగళవారం ఒంగోలులోని మెడికల్ కాలేజీ నందు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్ కోశాధికారి రంగారెడ్డి, ఒంగోలు పట్టణ అధ్యక్షులు మోటా శ్రీనివాసరావు, తాలూకా అధ్యక్షులు సురేష్‌బాబు, ప్రసన్న, ఏసురత్నం, శ్రీనివాసులు, అంకబాబులతోపాటు మెడికల్ కళాశాల ఉద్యోగులు విజయ లక్ష్మీ, శ్రీనివాస యాదవ్, బాబురావు, రాజేష్, కార్తీక్, దినకర్, ప్రభావతి, చాందిని, రమేష్ బాబు, లావణ్య, పద్మలత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# యూరియా వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్



ఒంగోలు, మేజర్‌న్యూస్: జిల్లాకు కేటాయించిన యూరియాను వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగించకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో యూరియా వినియోగంపై జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధ్యక్షతన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా వినియో గంపై డిఎస్ఓ, ఇండస్ట్రీస్, లేబర్, ఎక్సైజ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, డిటిసి, విజిలెన్స్ అండ్ ఫోర్స్మెంట్, పోలీస్, అగ్రికల్చర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యూరియా వ్యవసాయానికి కాకుండా వేరేదానికి ఉపయోగించారా అనేది కనిపెట్టాలని, ఇందుకు సంబంధించి ఆయా శాఖల అధికారులు కలిసి కట్టుగా తనిఖీలు నిర్వహించి సమగ్ర నివేదిక అందించాలన్నారు. పౌర సరఫరాలశాఖతో సమన్వయం చేసుకుని ఎడి.బి.ఎల్.యు యూనిట్లను తనిఖీలు చేయాలన్నారు. పరిశ్రమ, కార్మిక విభాగాలు, కాలుష్య బోర్డుతో సమన్వయం చేసుకుని ప్లైవుడ్, రెసిన్ యూనిట్ల తనిఖీలు చేయాలని, పరిశ్రమ, కార్మిక విభాగాలు, కాలుష్య బోర్డుతో సమన్వయం చేసుకుని పెయింట్స్, వార్నిష్ యూనిట్ల తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, డిటిసి సుశీల, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, మార్క్ ఫెడ్ డిఎం హరికృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, లేబర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
PRAKASAM ప్రకాశం BAPATLA బాపట్ల

## సైబర్ నేరాలు పట్ల అవగాహన పెంచుకోవాలి

### క్విస్‌లో అవగాహన సదస్సులో సిఐ సూర్యనారాయణ




ఒంగోలు, మేజర్‌న్యూస్:ఐటి కోర్ ఇన్స్పెక్టర్ వి.సూర్యనారాయణ ఒంగోలులోని క్విజ్ ఇంజినీరింగ్ కాలేజీ లో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. రోజు రోజుకూ సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలన్నారు. కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సైబర్ నేరాల గురించి తెలియజేయాలన్నారు. చదువుకోని వారు, చదువుకున్నవాళ్ళు కూడా ఇద్దరూ సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోతున్నారన్నారు. ఫేక్ ఎస్ఎంఎస్‌లు, ఓటీపీ మోసాలు, బ్యాంకు నుండి అని ఫోన్లు, వాట్సప్‌ల ద్వారా వచ్చే ఫేక్ లింక్స్, ఫేక్ లోన్ యాప్స్, మీ కేవైసీ పెండింగ్ అని జరిగే మోసాలు, డిజిటల్ అరెస్ట్ అనగా పోలీస్, సిబిఐ, వివిధ ఉన్నత శాఖల అధికారులంటూ ఫోన్ చేసి డబ్బులు వసూలు చేయడం వంటివి అని వివరించారు. ప్రతి ఒక్క విద్యార్థి వారి వారి తల్లిదండ్రులకు, చుట్టుపక్కల వారికి తెలియజేసి వారికి అవగాహన కలిగించి సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సి.ఐ సూర్యనారాయణ సూచించారు. ఒకవేళ సైబర్ క్రైమ్ లో బాధితులయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చేసి తగిన వివరాలు తెలపడం ద్వారా కొంతమేర నష్టపోయిన డబ్బును తిరిగి పొందచ్చని తెలపడం జరిగింది.

## పాఠశాలలకు క్లీనింగ్ కెమికల్స్ పంపిణీ : ఎంఈవో



కంభం, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కంభం పాఠశాలల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ క్లీనింగ్ కెమికల్స్ పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో అబ్దుల్ సత్తార్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ పరిధిలోని అన్ని పాఠశాలలకు టాయిలెట్ క్లీనింగ్,ఫ్లోర్ క్లీనింగ్, ఎయిర్ ఫ్రెషనర్స్ పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలకు అవసరమైన క్లీనింగ్ కెమికల్స్ అందిస్తున్నామని, పాఠశాలల్లో పారిశుద్ధ్య అవసరాలకు కెమికల్స్ వినియోగిస్తూ సద్వినియోగం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరనారాయణ, సుబ్రహ్మణ్యం, రవి కిషోర్ రెడ్డి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన గురజాల శ్రీనివాసులు ప్రజాపతి



పామూరు, మేజర్‌న్యూస్: అరివేముల గ్రామానికి చెందిన గురజాల వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు ఏడు కొండలు, బేస్తవారిపేట మండ లం పాపాయిపల్లి గ్రామానికి చెందిన ఎర్రపాలెం వెంకట్, చంద్రకళ దంపతుల కుమార్తె హరిప్రియ వివాహం అరివేముల గ్రామంలో మంగళవారం ఘనంగా జరిగింది. వివాహ కార్యక్రమంలో శ్రీ కుమ్మర శాలి వాహన సంఘం అధ్యక్షుడు గురజాల శ్రీనివాసులు ప్రజాపతి హాజరై ఆశీర్వ చనాలు అందించి నూతన వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు.





# ఉర్దూ పాఠశాలను చుట్టుముట్టిన విద్యార్థుల తల్లిదండ్రులు

### పాఠశాలకు సమయపాలన లేకుండా వస్తున్న ఉపాధ్యాయుడు
### ఇదేంటని ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తించి కేసు పెడతానని బెదిరింపులు

తర్లుపాడు, మేజర్‌న్యూస్: స్థానిక ఉర్దూ పాఠశాల, ప్రధానోపాధ్యాయుడు ముల్ల షాబుద్దీన్ పాఠశాలకు సరైన సమయానికి రావడం లేదని, తమ పిల్లలకు సరియైన విద్యా బోధన చేయడం లేదని,పాఠశాల సమయంలో పాఠశాలలో నిద్రిస్తూ ఎవరైనా వస్తారేమో విద్యార్థులను కాపలాగా ఉంచు తున్నాడని విద్యార్థుల ఆరోపించడంతో మంగళ వారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహంతో పాఠ శాలను చుట్టుముట్టారు. ప్రస్తుతానికి అవ్వవలసిన సిలబస్ కంటే తక్కువ సిలబస్ బోధించారని, కొన్ని సబ్జెక్టులలో అసలు మొదలే పెట్టలేదని తల్లి దండ్రులు ఆగ్రహించారు. తమ పిల్లలకు పొట్ట కోస్తే అక్షరం ముక్క రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు ఏదైనా ప్రశ్నిస్తే పిల్లలకు టీసీ ఇచ్చి పంపిస్తానని, తమపై కేసులు పెడతానని బెదిరిస్తున్నాడని తల్లిదండ్రులు, విద్యార్థులు చెప్పారు.

ఈ విషయంపై ఎంఈఓ దేవరకొండ సుజాతకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా ఎంఈఓ సుజాత వెంటనే పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులను, తల్లిదండ్రులను విచారించారు. అనంతరం తమ విచారణలో ఉపాధ్యాయుడిపై అనేక ఆరోప ణలు, ఫిర్యాదులు వచ్చాయని, గతంలో కూడా ఒకసారి ఫిర్యాదులు వస్తే మందలించడం జరిగిందన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలో ఉర్దూ మాత్రమే బోధించాలని తర్వాత మాత్రమే మిగతా భాషలలో బోధించాలన్నారు. ప్రధానోపాధ్యా యుడు ముల్ల షాబుద్దీన్ విద్యార్థులకు ఆంగ్లంలో బోధిస్తు న్నాడని, అది కూడా సరిగా బోధించడం లేదని, స్కూలుకు సరైన సమయానికి రావడం లేదని, మధ్యాహ్న సమయంలో కూడా భోజనానికి ఇంటికి వెళ్లి ఆలస్యంగా వస్తున్నట్లు తమ దృష్టికి తల్లి దండ్రులు తీసుకొచ్చారని అన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రశ్నిస్తే తమపై కేసులు పెడతానని చెప్పినట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. పై వచ్చిన ఫిర్యాదులను అన్నింటినీ రాతపూర్వకంగా డీఈవోకి సమర్పి స్తామని, తదుపరి చర్యలపై అధికారులు తీసుకుంటారని తెలిపారు.

## సీతారామయ్యను కలసిన హరిబాబు

### రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్చ



పామూరు, మేజర్‌న్యూస్: పామూరు మండల రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పామూరు సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు ముందడుగు వేశారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో చైర్మన్ కామేపల్లి సీతారామయ్యను మర్యాద పూర్వకంగా కలుసుకుని వివిధ సమస్యలను ప్రస్తావించారు. పామూరు రైతులకు రుణాల మంజూరు, వడ్డీ సబ్సిడీలు, పంట పెట్టుబడి సమస్యలు, బకాయిల వంటి అంశాలను చైర్మన్ దృష్టికి హరిబాబు తీసుకెళ్లారు.

## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



పొదిలి, మేజర్‌న్యూస్: పొదిలిలోని సర్ సివి రామన్ బీఈ డీ కాలేజ్ నందు పొదిలి, కొనకన మిట్ల,మరిపూడి మండలాల ఫోటో, వీడియో గ్రాఫర్స్ ఓల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్ ప్రసాద్ స్టూడియో ప్రొప్రైటర్ వై బాల ప్రసాద్ను దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు రావూరి శ్రీకాంత్, రాయల అశోక్, వెంకట్రావు, ప్రసాద్, బాబు, కృష్ణవీ శ్రీను, విశ్వ, సిద్ధు, శివ, రాజు, సిలార్, అజయ్, చలపతి, నరసింహ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మా భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు

### అన్నవరం చెందిన పలువురు రైతులు తహసీల్దార్‌కు వినతి



పొదిలి, మేజర్‌న్యూస్ : మండలంలోని అన్నవరం గ్రామ పరిధిలోని 75 సర్వే లో 30.40 ఎకరాల భూమి కొత్త పులి ఓబులు కొండయ్య , ఎర్రం రెడ్డి వీరయ్య, నాగిరెడ్డి, పులి నాగయ్య లు చెందింది కాగా వారి మరణాంతరం వారసత్వరీత్యా వారి వా రసులమైన మేము హక్కు దారులుగా ఉన్నాము .ఆ భూమిని కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి పోర్జరీ సంతకాలతో భూమిని ఆన్లైన్ చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఎర్రం రెడ్డి చెంచమ్మ, ఎర్రం రెడ్డి నాగిరెడ్డి , సంగటి నాగమ్మ, రావూరి నాగరత్నమ్మ,ఎర్రం రెడ్డి బాల చెన్నయ్య, పార్వతమ్మ, చిన్న కోటిరెడ్డి లు తాసిల్దార్ కృష్ణారెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. అసలైన హక్కుదారులు అయిన మేము ఎటువంటి సంతకాలు గాని, వేలిముద్రలు గాని వేసి ఉండలేదు. కావున తమరు అసలైన హక్కుదారులుగా మమల్ని గుర్తించి సదరు భూమికి మాకు ఆన్లైన్ మరియు టైటిల్‌డీడ్, పట్టాదార్ పాసు పుస్తకములు మంజూరు చేయాలని అభ్యర్థించారు.

## డిజే వాహనం పైనుంచి జారిపడిన యువకుడి మృతి

కనిగిరి, మేజర్‌న్యూస్: డిజే వాహనంపై నుండి జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి ఎన్ గొల్లపల్లి గ్రామం వద్ద జరిగింది. ఎస్సై టి.శ్రీరామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కనిగిరి మండలం చిన ఇర్లపాడు గ్రామానికి చెందిన ముద్ద మహేష్ (18) డిజే ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. తన మిత్రుడు అంబటి ఏసోబు, దోసపాటి చెంచయ్య, వాహన యజమాని మునిమల వెంకటేశ్వర్లు తో కలిసి డిజే కార్యక్రమానికి సిఎస్ పురం వెళ్లాడు. కార్యక్రమం పూర్తి అయిన తర్వాత తిరిగి వచ్చే క్రమంలో సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో మార్గ మధ్యలో ఎన్.గొల్లపల్లి గ్రామం వద్ద మహేష్ డిజే వాహనం పై నుండి జారి పడడంతో తలపై టైరు ఎక్కడంతో తీవ్ర రక్త గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు .రహదారి ప్రమాదంపై ఎస్సై శ్రీరామ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఓక్లాండ్ విశ్వవిద్యాలయంతో క్విస్ ఒప్పందం

ఒంగోలు, మేజర్‌న్యూస్: విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, గ్లోబల్ స్థాయిలో అధునాతన విద్యను అందించే విధంగా క్విస్ మరో మైలు రాయిని చేరుకుంది. అమెరికాలోని మిచిగాన్ లో ప్రముఖ ఓక్లాండ్ విశ్వవిద్యాలయం, క్విస్ విద్యాసంస్థల మధ్య అవగాహన ఒప్పందం జరిగినట్లు యాజమాన్యం తెలియజేసింది. ఈ మేరకు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఓక్లాండ్ విశ్వవిద్యాలయంలోని డెసిషన్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ విభాగం చైర్ ప్రొఫెసర్ డాక్టర్ విజయన్ సుగుమారన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. క్విస్ కి చెందిన విద్యార్థులు



ఓక్లాండ్ లో జరిగే ఆర్టికల్ ప్రోగ్రామ్ లో, ముఖ్యంగా బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ లో ప్రోగ్రామ్ లో పాల్గొనేందుకు ఉపయోగపడుతుంది. ఏటా దాదాపు 20 మంది గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ ప్రోగ్రామ్ లో పాల్గొనవచ్చు. దీని ద్వారా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి కోర్సులు, సర్టిఫికెట్లు రావడమే కాకుండా గ్లోబల్‌గా కూడా గుర్తింపు లభించనుంది. ఇలాంటి ఒప్పందాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి అన్నారు. విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంలో క్విస్ విద్యాసంస్థలు ఎప్పుడు ఉంటాయని ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు అన్నారు. ఈ ఎంవోయూ కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ ప్రొఫెసర్ జాఫర్ పాల్గొన్నారు. విద్యార్థులకు ఎంతో ఉపయోకరమైన ఎంవోయూ ఇది అని ఆయన అభిప్రాయపడ్డారు.



## లోకేష్, నరసింహారావు ఫ్రేమ్‌ను హరీష్ బహుకరణ

పామూరు, మేజర్‌న్యూస్: టిడిపి యువ నాయకుడు లక్ష్మీనరసాపురం ఎంపిటిసి సభ్యుడు బొల్లా నరసింహారావు జన్మదిన వేడుకలో విశేషం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా టిడిపి వాణిజ్య విభాగం కనిగిరి నియోజకవర్గ అధ్యక్షుడు పందిటి హరీష్ నరసింహారావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఉన్న నరసింహారావు ఫోటోను, ఆయన తండ్రి స్వర్గీయ టిడిపి నాయకుడు మాజీ జెడ్పిటిసి సభ్యుడు బొల్లా మాలాద్రి చౌదరి స్మృతి చిత్రంతో కలిపి ప్రత్యేక ఫ్రేమ్‌గా ముద్రించి బహుకరించారు. ఈ సత్కారం చూసి కార్యకర్తలు చప్పట్లు కొట్టగా నరసింహారావు భావోద్వేగానికి గురయ్యారు. లోకేష్ ఆశీస్సులు, తండ్రి జ్ఞాపకాలు కలిసి ఉన్న ఈ ఫ్రేమ్ జీవితాంతం గుర్తుండిపోతుంది అని అన్నారు.

## నేడు ప్రజావేదిక

దర్శి, మేజర్‌న్యూస్: మండల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక మండల పరిషత్ కార్యాలయం నందు బుధవారం జరుగుతుందని ఏపిఓ బోయిన మురళి తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ నుండి ఈ ఏడాది మార్చి వరకు మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులు పై సోషల్ ఆడిట్ కార్యక్రమం జరుగుతుందని ఏపీవో తెలిపారు. ఈ నెల రెండవ తేదీ నుండి 18 వ తేదీ వరకు గ్రామాల్లో చేసిన పనులపై ఆడిట్ బృందం పరిశీలించి నివేదికను తయారుచేసిందని ఆయన తెలిపారు. ప్రజావేదికలో నివేదికను ఆడిట్ బృందం చదివి వినిపిస్తారని చేసిన పనుల్లో అవకతవకలు జరిగి ఉంటే అట్టి వారిపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుంటారని ఏపీఓ తెలిపారు.

# పాఠశాలకు క్రీడా సామగ్రి బహూకరణ



అద్దంకి, మేజర్‌న్యూస్: పుట్టంరాజు దంపతుల సౌజన్యంతో రూ.8,000 విలువైన సామగ్రి అందజేత. పుట్టంరాజు బుల్లెయ్య-రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పుట్టంరాజు తాండవ కృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రూ.8,000 విలువైన క్రీడా సామగ్రిని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బహూకరించారు. ప్రధానోపాధ్యాయులు గంగా ధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంఈవో 2 కే వి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టంరాజు కుటుంబం చేసిన ఈ సేవ విద్యార్థులకు ప్రేరణనిచ్చే విధంగా ఉంది. గ్రామీణ పాఠశాలల్లో ఇలాంటి సదుపాయాలు లభించడం ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తుంద న్నారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి, జిల్లా-రాష్ట్ర స్థాయిలోనే కాకుండా దేశ స్థాయిలోనూ ప్రతిష్ఠత సాధించాలని ఆకాంక్షిస్తు న్నానన్నారు. దాత శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత తరానికి పుస్తకాభ్యాసం మాత్రమే కాకుండా క్రీడల్లోనూ సమాన ప్రాధాన్యత అవసరమన్నారు. క్రమశిక్షణ, సమయపాలన, సమన్వయం, ఆరోగ్యకరమైన పోటీ భావన వంటి విలువలను క్రీడలు విద్యార్థుల్లో పెంపొందిస్తాయి. అందువల్ల పాఠశాలల్లో క్రీడా సామగ్రి సమృద్ధిగా ఉండటం అత్యవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో వి. సుధాకరరావు, జె. ప్రతాప్, పి. డి . మధు, ధనలక్ష్మి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా వరల్డ్ ఫొటోగ్రఫీ డే వేడుకలు



ఒంగోలు, మేజర్‌న్యూస్: ది ఒంగోలు ఫోటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు గుప్తాస్ స్వేర్ లో నిర్వహించిన వరల్డ్ ఫోటోగ్రఫీ డే వేడుకల్లో పెద్ద సంఖ్యలో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో షుగర్, శస్త్రకోశ నిపుణులు డాక్టర్ మహమ్మద్ జహంగీర్ సుల్తార్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ కె.వెంకట హరీష్ కుమార్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులకు పోస్టల్ బీమా, ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ పత్రాలను, ఫోన్ పే స్కానింగ్ బాక్సులను అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు దగ్గుపాటి వెంకట్రావు మాట్లాడుతూ, అసోసియేషన్ పటిష్టానికి సభ్యులు అందరూ సహకరించాల న్నారు. సభ్యుల సంక్షేమ కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ దొడ్డా చంద్రశేఖర్, ట్రెజరర్ నబీరసూల్, గౌరవ సలహాదారులు ఉదయ్ హరి, ఉపాధ్యక్షుడు ఉప్పుటూరి చంద్రశేఖర్, ప్రసాద్, రమణ మాధవరావు, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# భైరవకోనకు వెళ్తున్నామని మృత్యు ఒడిలోకి

- పునుగోడు చెరువులో ఈతకొడుతూ ఇద్దరు యువకులు మృతి





కనిగిరి, మేజర్‌న్యూస్: భైరవకోనకు వెళ్తున్నామని ఇంట్లో చెప్పి పునుగోడు చెరువులో ఇద్దరు యువకులు మృతదేహాలు బయట పడిన సంఘటన మంగళవారం జరిగింది. ఎస్సై టి.శ్రీరామ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కనిగిరి పట్టణం నక్కలతిప్పకు చెందిన బొందలపాటి శివ (19) శంఖవరంకు చెందిన ఏనుగంటి గౌతమ్ (17)లు ఈనెల 17 న ఉదయం భైరవకోనకు వెళ్తున్నామని ఇంటి నుండి బయలు దేరి వచ్చారు. మంగళవారం కనిగిరి మండలం పునుగోడు చెరువులో ఇద్దరు యువకులు మునిగి మరణించి నీటిపై తేలుచున్నారని కనిగిరి పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే కనిగిరి డిఎస్పీ పి.సాయి ఈశ్వర్ యస్వంత్, సీఐ షేక్ ఖాజావలి, ఎస్సై టి.శ్రీరామ్ ,తహశీల్దార్ ఏవి రవి శంకర్ వారి సిబ్బందితో కలిసి పునుగోడు చెరువును సందర్శించి నీటిలో తేలాడుచున్న ఇద్దరి మృతదేహాలను బయటికి తీయించారు. వారు కనిగిరి మున్సిపాలిటీకి చెందిన శివ ప్రసాద్, గౌతమ్‌లుగా వారి బంధువుల ద్వారా గుర్తించారు. పునుగోడు చెరువులో ఈత కొటుతూ ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయి మరణించినట్లు నిర్ధారణకు వచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్పీ సాయి ఈశ్వర్ ప్రసాద్



మాట్లాడుతూ పిల్లలు బయటికి వెళ్ళేటప్పుడు వారు ఏమి చేస్తున్నారు తెలుసుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

## 22న మండల సర్వసభ్య సమావేశం: ఎంపిడివో



వెలిగండ్ల, మేజర్‌న్యూస్: ఈ నెల 22వ తేదీ శుక్రవారం వెలిగండ్ల మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలు రామన మహాలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సమావేశానికి వచ్చేటప్పుడు మండల స్థాయి వివిధ శాఖల అధికారులు శాఖల వారిగా పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు ఈ సమావేశానికి జడ్పిటిసి సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు. గైర్హాజరైన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## ఘనంగా బొల్లా నరసింహారావు జన్మదిన వేడుకలు



పామూరు, మేజర్‌న్యూస్: టిడిపి యువ నాయకుడు లక్ష్మీనరసాపురం ఎంపిటిసి సభ్యుడు బొల్లా నరసింహారావు జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి మిల్క్ డైరీలో ఘనంగా నిర్వహించారు. ఈ ఘన వేడుకలో నరసింహారావు తల్లి, శ్రీ మహాలక్ష్మి మిల్క్ ప్రొడక్ట్ అధినేత, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు బొల్లా మహాలక్ష్మి, సతీమణి బొల్లా ఝాన్సీ, కుమారుడు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి అందరికి తినిపిస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. జన్మదిన వేడుకలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై బొల్లా నరసింహారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గణేష్ విగ్రహాల మండపాలకు అనుమతి తప్పనిసరి



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండపాలు, పందిళ్ల ఏర్పాటు కోసం తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ వి.మహేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ నందు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసిన మండపాల వద్ద భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు కూడా అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. మండపాల స్థలాల దగ్గర వివాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. యాప్‌లో కమిటి సభ్యుల వివరాలు నమోదుచేసుకోవాలని నిమజ్జనం ఎప్పుడు అయితే అప్పుడు తేదీ నమోదు చేయాలని యాప్‌ని పోలీస్ వారు మానిటర్ చేస్తారని తెలిపారు.



## పామూరు ఎంపిపికి కీలక బాధ్యత

పామూరు, మేజర్‌న్యూస్: పామూరు మండల ఎంపీపీ గంగసాని లక్ష్మికి వైఎస్ఆర్‌సీపీ కీలకమైన బాధ్యత కట్టబెట్టింది. ఆమెను నెల్లూరు జిల్లా మహిళా జోనల్ ఇంచార్జ్ అధ్యక్షురాలుగా నియమించడంతో పామూరు పేరు మరోసారి ప్రతిధ్వనించింది. ఈ సందర్భంగా మంగళవారం నెల్లూరు జిల్లాలో పర్యటించిన గంగసాని లక్ష్మిని రాష్ట్ర ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సునంద, కాకాని పూజిత రెడ్డి, ఆనం విజయ కుమార్ రెడ్డి ఘనంగా సన్మానించారు. మహిళా నాయకత్వానికి గంగసాని లక్ష్మి ఒక ప్రతీక అని పామూరు నుంచి ఇంతటి బాధ్యతలు దక్కించుకోవడం ఆమె కృషికి నిదర్శనం అని నేతలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్ఆర్‌సీపీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం




బాపట్ల మేజర్ న్యూస్: వచ్చేనెల 5న గురుపూజ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య, ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈనెల 24 తేదీలోపు మండలంలోని విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులకు ప్రతిపాదనలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ పటిష్టంగా చేపట్టాలి

## వీడియో కాన్ఫరెన్స్‌లో సిసిఎల్ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సిసిఎల్ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి జాయింట్ కలెక్టర్లకు సూచించారు. విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి మంగళవారం ఉదయం పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, కాస్ట్ సుమోటో డ్రైవ్, జాయింట్ ఎల్‌పీఎం, అటవీ భూముల సమస్యలకు పరిష్కారం, అన్నదాత సుఖీభవ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్లతో




వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసిఎల్ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాజముద్రతో తయారు చేసిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో చేపట్టిన రీ-సర్వే ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్లకు సూచించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు సంబంధించి అటవీ భూములకు సంబంధించి జాయింట్ ఎల్‌పీఎం సమస్యలకు పరిష్కారం చూపేలా జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సిబ్బంది తదితరులు తదితరులు పాల్గొన్నారు.





## ఉప రాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎంపి మాగుంట

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన సీపీ రాధాకృష్ణన్‌ను రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్‌తో పాటు సహచర ఎంపిలతో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి కలిసి న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైనందుకు టీడీపీ తరపున శుభాకాంక్షలు తెలిపారు. మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేసిన అనుభవం రాబోయే రోజుల్లో దేశానికి సమర్థవంతమైన సేవలు అందించడానికి ఉపకరిస్తుందని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరైన రాధాకృష్ణన్ తమలాంటి కొత్తతరానికి ఆదర్శంగా నిలుస్తారని తెలియజేశారు.

## వాతావరణంలో వేడి వాయువుల తగ్గింపుపై చర్యలేవి: ఎంపి మాగుంట ప్రశ్న

ఒంగోలు, మేజర్‌న్యూస్: వాతావరణంలో వేడి వాయువుల తగ్గింపుపై తీసుకుంటున్న చర్యలేవని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. దేశంలో వాతావరణంలో వేడి వాయువుల తగ్గింపుపై సర్వే, పథకాలు, నిధులు, తప్పు చేసిన కంపెనీలు, శిక్షలు, అవగాహనా సదస్సులు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో మాగుంట అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అడవులు,



వాతావరణ మార్పుల శాఖల సహాయక మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వివరణ ఇచ్చారు. యునైటెడ్ నేషన్స్ ఫ్రేంవర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ చేంజ్‌లో భారతదేశం సభ్యత్వం కలిగినందున, వాతావరణ మార్పుల గురించి ద్వైవార్షిక నివేదికలను పంపిస్తుందని, భారతదేశం 2020లో పంపిన 4వ నివేదిక ప్రకారం, ఉద్గారం, వేడి వాయువు 2,436 మిలియన్ టన్నులు వుండగా, 2019లో 2,646 మిలియన్ టన్నులు ఉన్నదని తెలిపారు. దేశంలో విద్యుత్ ప్లాంట్లు, కర్మాగారాలు, కార్లు విడుదల చేసే వేడి వాయువులను ఎదుర్కొనేదానికి ప్రభుత్వం 'నేషనల్ ఆక్షన్ ప్లాన్ ఆన్ క్లైమేట్ చేంజ్' ద్వారా నిర్దిష్ట ప్రాంతాలలో సౌర శక్తి, మెరుగైన శక్తి సామర్థ్యం, నీరు, వ్యవసాయం, హిమాలయ పర్యావరణ వ్యవస్థ, స్థిరమైన ఆవాసాలు, హరిత దేశం, మానవ ఆరోగ్యం, వాతావరణ మార్పులపై జ్ఞానం గురించి అనేక జాతీయ కార్యక్రమాలను అమలుచేస్తాయని, రాష్ట్రాలు వాటి ప్రణాళికలను తయారు చేసుకొంటాయని తెలిపారు. వాతావరణ మార్పు అనేది ప్రపంచ వ్యాప్త సమస్య అని, ముఖ్యంగా బాగా అభివృద్ధి చెందిన దేశాలు ఆలోచన లేమితో మితిమీరిన చారిత్రిక, ప్రస్తుత ఉద్గారాలు కలుగుజేస్తున్నాయని, కాని 1850 నుండి 2019 వరకు ప్రపంచంలో విడుదల చేసే బొగ్గుపులుసు వాయువుల్లో ప్రపంచ జనాభాలో 17 శాతం కలిగిన భారతదేశం కేవలం 4 శాతం మాత్రమే విడుదల చేస్తుందని తెలిపారు. పర్యావరణ అవగాహన పెంపునకు పలు పర్యావరణ సంస్థలు ద్వారా కార్యక్రమాలను వాతావరణ మార్పుల శాఖ అమలుచేయుచున్నదని కేంద్రమంత్రి తెలియజేశారు.

## డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్స్‌ను త్వరగా ఆమోదించాలి

### జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బ్యాంకర్లకు ఆదేశం

ఒంగోలు, మేజర్‌న్యూస్ : డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్స్‌ను త్వరగా ఆమోదించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బ్యాంకర్లకు సూచించారు. డిఆర్డిఏలోని పొదుపు సంఘాల మహిళలకు రుణాల మంజూరుపై మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని పరిస్థితిని డిఆర్డిఏ పిడి నారాయణ ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. పొదుపు సంఘాల మహిళలు రుణాలను తిరిగి చెల్లించడంలో చురుకుగా ఉన్నారని ఆయన తెలిపారు. గతంలో వీరికి రుణాలు మంజూరు చేయడానికి గ్రూపులోని సభ్యులందరూ సంతకాలు చేసిన పత్రాలను బ్యాంకులకు సమర్పించే వారని చెప్పారు. ఇప్పుడు బయోమెట్రిక్ వేలిముద్ర వేయటం ద్వారా గ్రూపు సభ్యులు తమ అంగీకారం తెలుపుతున్నారని వివరించారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఈ విధానం ద్వారా మైక్రో క్రెడిట్ ప్లాన్స్‌ను బ్యాంకులు ఆమోదించటంలో కొంత జాప్యం జరుగుతున్నట్లు చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ త్వరగా ఈ తాత్కాలిక డిజిటల్ అప్రూవల్స్ ను ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ విషయాల్లో బ్రాంచ్ మేనేజర్లకు



అవగాహన కల్పించేలా గురు, శుక్రవారాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. బ్యాంకర్లకు ఏపీఎంలు కూడా అందుబాటులో ఉండేలా చూడాలని పిడిని ఆమె ఆదేశించారు. మైక్రో క్రెడిట్ ప్లాన్స్‌ను ఆమోదించడంలో జిల్లా స్థానం మెరుగ్గా ఉండాలని ఆమె అన్నారు. అంతేకాకుండా డ్వాక్రా సంఘాల మహిళలు చేస్తున్న పొదుపు డబ్బులలో 75 శాతం ఫిక్స్ డిపాజిటివ్ చేయాలని, మిగతా 25 శాతం డబ్బులను అంతర్గత రుణాలకు ఇవ్వాలని కలెక్టర్ చెప్పారు. పది రోజులలో ఈ మేరకు చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో ఎల్.డి.ఎం.రమేష్, బ్యాంకుల రీజినల్ మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పనుల నాణ్యతతో రాజీపడొద్దు

**మొదటి పేజీ తరువాయి** పనులు ప్రారంభం కాలేదు. తక్కువ ధరకు టెండర్లు వేసి కొంతమంది కాంట్రాక్టర్లు పనులు కూడా మొదలు పెట్టలేదని, అలాంటి కాంట్రాక్టర్లు పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. నిజాయితీగా పనిచేసే కాంట్రాక్టర్లకు భవిష్యత్తులో కూడా సంపూర్ణ సహకారం అందిస్తామని భరోసాను ఇచ్చారు. పెండింగ్ బిల్లులు, చేసిన పనులకు బిల్లులు చెల్లింపులకు చర్యలు చేపడతామని తెలిపారు. మున్సిపాలిటీ రూ 45 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది, ప్రభుత్వం నుంచి రూ.50 కోట్లు నిధులు రావాల్సి ఉందని వివరించారు. అవి వస్తే కాంట్రాక్టర్లకు కూడా వెంటనే డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఒంగోలు అభివృద్ధి ప్రజల సంక్షేమం ప్రాధాన్యత తమకు ముఖ్యం, ఆ దిశగా అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్లు, కాంట్రాకర్లు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే దామచర్ల సూచించారు. ఈ సమావేశంలో మేయర్ గంగాడ సుజాతతో పాటు డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి బురద రాజకీయాలు మానుకోవాలి

**మొదటి పేజీ తరువాయి** హాస్యాస్పదంగా ఉందన్నారు. 75 ఏళ్ల యువకుడు చంద్రబాబు అని ఇప్పటికీ ప్రతిరోజు 18 గంటలు రాష్ట్రం కోసం ప్రజల కోసం అనునిత్యం పనిచేస్తూ అభివృద్ధి, సంక్షేమ గురించి నిత్యం కష్టపడుతున్నారని చెప్పారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని బురద రాజకీయాలు మానుకోవాలని వైసిపి నాయకులకు హితవు పలికారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మార్కాపురం పట్టణ, మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈనెల 25న సాయంత్రం 4 గంటలకు మార్కాపురం మార్కెట్ యార్డు ఆవరణలో జరగనున్న మార్కాపురం ఏఎంసి చైర్మన్‌గా మాలపాటి వెంకటరెడ్డి ప్రమాణ స్వీకారం మహోత్సవానికి మార్కాపురం పట్టణ మార్కాపురం మండల తర్లుపాడు మండలాల నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## లోకేష్ ఢిల్లీ పర్యటనతో మరింత అభివృద్ధి: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**మొదటి పేజీ తరువాయి** మామిడి బోర్డులను ఏర్పాటు చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి పిష్ గోవిల్‌ని కోరారని వెల్లడించారు. అదేవిధంగా ఆంధ్ర రాష్ట్రానికి రావలసిన నిధులు లోటు బడ్జెట్, రాజధాని నిర్మాణం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తదితర ఆర్థిక లోటు నుంచి రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు సంపూర్ణ సహకారం అందించాలని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిసి కోరడం వీటన్నింటిపై సానుకూలత వ్యక్తమవ్వడం రాష్ట్ర అభివృద్ధిలో మరో మైలురాయిగా చెప్పవచ్చని వివరించారు. ఇలా ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం మన యువ నేత నారా లోకేష్‌బాబు కృషి చేస్తున్నారని, అదే స్ఫూర్తితో మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని డాక్టర్ లక్ష్మీ పిలుపునిచ్చారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి** శాఖల ఏఈఈలతో మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాల్సిన ప్రధాన బాధ్యత ఎంపీడీవోలదే అన్నారు. అందుకే డ్వామా, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, డిఆర్డిఏ, పంచాయతీ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులపై ప్రతి బుధవారం ఎంపిడివో అధ్యక్షతన సమావేశం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి సంరక్షణ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయటంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెలాఖరులోగా ఇంకుడు గుంతలు అన్నింటినీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పిడి జోసఫ్‌కుమార్, డిపిఓ గొట్టిపాటి వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, డిఆర్డిఏ పి.డి.నారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఈ నిషాద్, డి.ఎల్.డి.వో.లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి: ఎస్సై



నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: మండలంలో ఈనెల 27వ తేదీ నుండి గణేశ్ మండపాల ఏర్పాటు మొదలు నిమజ్జనం వరకు అన్ని నిబంధనలను పాటించడంతో పాటు, ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నాగులుప్పలపాడు ఎస్సై రజియా సుల్తానా బేగం స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అందరూ సహకరించాలంటూ ఎస్సై కోరారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులు ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు మండల పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఇందుకోసం పోలీస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఎస్సై తెలిపారు. వచ్చిన దరఖాస్తులపై పోలీసులు ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి అనుమతులు మంజూరు చేస్తారన్నారు. గ్రామస్థాయిలో ఏ ప్రదేశంలో వినాయక మండపం ఏర్పాటు చేస్తారు? ఎప్పుడు, ఎక్కడ నిమజ్జనం చేస్తారు? ఏ దారి గుండా ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది? అందుకు సంబంధించిన వాహనాలు మరియు వాహనాలకు సంబంధించిన పత్రాలు డ్రైవింగ్ లైసెన్సులు అనే అంశాలతో కూడిన పూర్తి వివరాలు దరఖాస్తులో పొందుపర్చాల్సి ఉంటుందన్నారు. ఎన్వోసీ సర్టిఫికెట్ తీసుకోవాలని, వివాదాస్పద ప్రదేశాలతో పాటు యజమానులు అనుమతించకపోయినా ఆయా ప్రదేశాల్లో ఎట్టి పరిస్థితుల్లో వినాయకుడి మండపాలు ఏర్పాటు చేయకూడదని తేల్చిచెప్పారు. సెల్లార్లు, కాంప్లెక్సుల్లో నిర్వహించే ఉత్సవాలకు కూడా పోలీసుల అనుమతులు తప్పనిసరి. అలాగే మండపాలకు సంబంధించి కరెంట్ కోసం విద్యుత్‌శాఖ నుంచి తప్పని సరిగా అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. గణేశ్ మండపాల వద్ద 2 స్పీకర్ బాక్సులకు మించి వాడకూడదని పోలీసులు తేల్చి చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ స్పీకర్ బాక్సుల వినియోగంపై నిషేధం విధించడం జరిగిందని ఎస్ఐ ఈ సందర్భంగా తెలిపారు.




## ఈ-పంట నమోదు, ఫసల్ భీమా రైతులకు లబ్ధి

**– వ్యవసాయ అధికారి మధుబాబు**

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని రైతులు తాము వేసిన పంటలకు తప్పనిసరిగా ఈపంట నమోదు చేయించుకోవాలని అదేవిధంగా ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకం కింద రుసుం చెల్లించి పంటలకు భీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.మధుబాబు తెలిపారు. బుధవారం మండలంలోని నల్లమడుగుల,శీలంవారిపల్లె గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏఓ రైతులు వేసిన పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు అధిక దిగుబడి సాధించడానికి పలుసూచనలు చేశారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి అన్నదాత సుఖీభవ పథకం లబ్దిపొందని రైతులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు అదేవిధంగా రైతులు ఈపంటనమోదు ఫసల్ భీమా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో మధుబాబు, వ్యవసాయ సహాయకులు యన్.రమేష్, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.



## అధిక శాతం ఎరువులను వాడరాదు

రేపల్లె మేజర్ న్యూస్: అన్నదాత సుఖీభవ అర్హత ఉండి డబ్బులు అందని రైతులకు ఆగస్టు 20 వ తేదీ వరకు గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం వారు అవకాశం కల్పించారని మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ మహేష్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పిరాట్లంక పంచాయతీలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఇటీవల వర్షాలు గురైన నారుమలను నాట్లు వేసిన పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాట్లు వేసిన పొలాలలో నీరు అధికంగా ఉంటే బయటకు పోయే విధంగా దారులు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ పథకానికి ఎంపిక కాని వారు ఈనెల 20వ తేదీ లోపు స్థానిక సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారి వద్ద తమ పత్రాలను అందజేసి పథకానికి అర్హులు కావాలని ఆయన కోరారు. రైతులకు పంటల సంరక్షణ, ఎరువుల వినియోగం, పురుగుమందుల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రేపల్లె మండలంలో రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటు న్నాము అన్నారు. ఈ క్రమంలో రైతు సేవా కేంద్రాలకు యూరియా ఇండెంట్ పంపించడం జరిగిందని ఏ ఓ తెలిపారు.

## కొల్లూరు మండలంలో పొలం పిలుస్తుంది




కొల్లూరు, మేజర్‌న్యూస్: కొల్లూరు మండలం గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వి నరేంద్రబాబు మంగళ వారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వ హించడం జరిగింది. ఈ కార్యక్ర మానికి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు ఈ పంట నమోదు చేసుకొనుటకు సర్వర్ వచ్చి ఉన్నది కావున ప్రతి ఒక్క రైతు పొలం పాస్ పుస్తకం ఆధార్ కార్డు మరియు ఫోన్ నెంబర్ తీసుకుని మీకు అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రంలో వి ఏ ఏ మరియు వి హెచ్ ఏ లకు మీ వివరాలు అందించి వరి పంట ఏది వేసారో తెలియజేసి ప్రతి ఒక్కరు ఈ పంట నమోదు చేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. మండల హార్టికల్చర్ అధికారి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ హార్టికల్చర్ క్రాప్స్ ప్రతి రైతు ప్రతి ఒక్క సెంటును ఈ పంట నమోదు చేసుకో వాలని తెలియజేశారు మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతుకు రైతు సేవ సిబ్బంది అందుబాటులో ఉండి ఈ పంట నమోదు చేయాలని సూచిం చారు అదేవిధంగా కౌలు రైతులకు కౌ లు కార్డులు ఇచ్చి ప్రభుత్వం నుండి వచ్చు అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు వచ్చే విధముగా చూడాలని ఆయన సూచించారు ఈ కార్యక్ర మంలో వ్యవసాయ విస్తరణ అధికారులు బి ఎన్ వంశీ వి ఏ ఏ లు మరియు రైతులు పాల్గొన్నారు.



## చెన్నారెడ్డిపల్లి, నాయుడుపల్లి గ్రామాలలో 'పొలం పిలుస్తుంది'

తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంటలు బీమా పథకాన్ని ఆగస్టు 30వ తారీకు వరకు పొడిగించారని తెలియజేశారు. బీమా చేసుకునే రైతులు త్వరగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఖరీఫ్ 2025 ఈ పంట నమోదు కార్యక్రమాన్ని మండలంలో చేపట్టి ఉన్నారు కావున రైతులందరూ వారు వేసినటువంటి పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఎవరికైనా సమస్య ఉన్న ఎడల వారి రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రది ంచి నివృత్తి చేసుకోవాలని తెలియజేశారు. అన్నదాత సుఖీభవ పథకము గ్రీవెన్స్, మోడక్రేపటితో ముగుస్తుందని తెలిపారు. అనంతరం చెన్నారెడ్డిపల్లి, నాయుడు పల్లి గ్రామాలలో వేసిన పెసర కంది మొదలుకు పేర్లను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవేంద్ర గౌడ్, రైతు సేవ కేంద్రం సిబ్బంది అరవింద్, సావిత్రి, ఏపిసిఎన్ఎఫ్ సిబ్బంది, వెంకటనారాయణ రెడ్డి చెన్నారెడ్డిపల్లి, తర్లుపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## జింక్ సల్ఫేట్ భాస్వరం, తెగులు మందులతో కలిపి వాడొద్దు




నగరం, మేజర్‌న్యూస్: రైతులు తమ పంట పొలాల్లో జింక్ సల్ఫేట్‌ను భాస్వరం ఎరువు, పురుగు తెగులు మం దులతో కలిపి వాడరాదని, ఎరువులు వాడే సమయంలో నత్రజని, భాస్వరం, పొటాష్ ఏ మోతాదులో ఎంతెంత వాడాలో మండల వ్యవసాయాధికారి వి. రమేష్‌బాబు వివరించారు. మంగళ వారం మండల పరిధిలోని ధూళిపూడి నార్త్ గ్రామంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ రమేష్‌బాబు మాట్లాడుతూ మండలంలోని అన్ని రకాల ఎరువులు పీఏసీ ఎస్, ఆర్ఎస్‌కెలలో అందుబాటులో ఉంచామని రైతులు సద్వినియోగం చేసికోవాలన్నారు. ప్రైవే టు డీలర్లు అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్ వరి పంట, ఇతర పంటలు సాగుచేసే రైతులు పంట నమోదు కోసం రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. అనంతరం వరి నారు మళ్ళు, పచ్చిరొట్ట పైర్లను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె. నాగశ్రీనివా సరావు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు పి. స్వాగతలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.




## మొక్కజొన్నలో ఇనుపధాతు లోపాన్ని నివారించుకోవాలి

అద్దంకి, మేజర్‌న్యూస్: మొక్కజొన్న లో ఇనుపధాతు లోపాన్ని నివారించుకోవాలని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సరళ సూచించారు. వెంపరాల మరియు చక్రాయపాలెం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం లో భాగం గా వ్యవసాయాధికారి సరళ మాట్లాడుతూ మొక్కజొన్న లో ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కజొన్న లో ఇనుపధాతు లోపం గుర్తించడం జరిగిందని నివారణ కొరకు ఫెర్రస్ సల్ఫేట్(అగ్రోఫర్) 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం బర్లీ పొగాకు సాగు నిషేధం విధి చారని ఎవరూ సాగు చేయవద్దని సూచించారు. కార్యక్ర మం లో ఉద్యాన అధికారిణి ఎస్.దీప్తి మాట్లాడుతూ ఎస్.సీ రైతులకు కూరగాయల సాగు కు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రసన్న, శివాని తదితరులు పాల్గొన్నారు.

## వేరుశెనగ రైతులకు శిక్షణ

చిన్నగంజాం, మేజర్‌న్యూస్: పంట నమో దు కార్యక్రమం జరుగుతుందని పంట వేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రైతులను కోరారు.మంగళవారం మండలంలోని పెదగంజాం రైతు సేవా కేంద్రం పరిధిలో పెద్ద గొల్లపాలెం నందు మండల వ్యవసాయ శాఖ అధ్వర్యంలో జాతీయ ఆహార నూనెల మిషన్- నూనె గింజలు పథకం నందు వేరుశెనగ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మురళీధర్ నాయక్, తన్నీరు రత్నకుమారి హజరై వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 349 రైతులకు 304 క్వింటాళ్ళు వేరుశనగ విత్తనాలు 100శాతం రాయితీ మీద టిసిజివిఎస్–1694 పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మురళీధర్ నాయక్, తన్నీరు రత్నకుమారి, మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, సహాయ వ్యవ సాయ సంచాలకులు, గ్రామ సహాయ సం చాల కులు, అశోద్ అంజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.






## గోగినేనివారిపాలెం, మిట్టపాలెం గ్రామాల్లో....

కొండపి, మేజర్‌న్యూస్: మండలంలోని గోగినేనివారిపాలెం, మిట్టపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మండల వ్యవసాయ అధికారి యం.మాల్యాద్రి రైతులతో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ సంబంధించి అర్హత ఉండి డబ్బులు పడని వాళ్ళు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20వ తేదీతో గడువు ముగియనున్నట్లు తెలియజేశారు. అదే విధంగా ఆధార్ నంబర్స్ తప్పుగా లింక్ అయ్యిన వాళ్ళు కుటుంబంలో రైతులు చనిపోయి ఉంటే వాళ్ళకి సంబంధించిన కుటుంబం సభ్యులు మ్యుటేషన్ చేయించుకోవడానికి ఈ నెల 31 వరకు అవకాశం ఉన్నట్లు తెలియపరిచారు. అలా చేయించు కున్న వారికి అన్నదాత సుఖీభవ మొదటి విడత వెంటనే పడతాయి అని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com



# ఓట్ల దొంగలపై న్యాయపోరాటం ఆగదు: శ్రీపతి సతీష్

కొండపి, మేజర్‌న్యూస్: ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను భారతీయ ఎలక్షన్ కమిషన్ చేస్తున్న ఓట్ల జాబితా జిమ్మిక్కులపై రాజ్యాంగ పరిరక్షణ పోరాటానికై యువనేత రాహుల్ గాంధీ యాత్రకు మద్దతుగా ఏఐసిసి పిసిసి పిలుపుమేరకు కొండేపిలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ కొండేపి అంబేద్కర్ బొమ్మ సెంటర్ దగ్గర నుండి ఎమ్మార్వో ఆఫీస్ ఎండిఓ ఆఫీస్ మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపతి సతీష్ మాట్లాడుతూ ఒక్క బీహార్ రాష్ట్రంలోనే 65 లక్షల ఓటర్లను తొలగించారని మనుషులు బ్రతికున్న చనిపోయిన జాబితాలో చేర్చి ఓటర్లను తొలగించారని బిజెపికి అరుకులైన ఓట్లను లక్షల్లో చేర్చారని రాహుల్ గాంధీ ఓటర్ల డిజిటల్ లిస్ట్ అడిగితే ఇంతవరకు ఇవ్వలేదని ఎలక్షన్ కమిషన్ చేస్తున్న మోసాలను ఎండగడుతున్న రాహుల్ గాంధీకి దేశ ప్రజలు సాహో అంటున్నారని బిజెపి ఇలాంటి దుర్మార్గమైన ఓటర్ల జాబితాను ఏర్పరిచి దొంగ ఓట్లను కలెక్షన్లో చేర్చి అధికారంలోకి రావాలని చూస్తుందని జరిగిన ఎన్నికలలో కూడా ఇలాంటి వ్యవహారాన్ని కొనసాగించారని దేశవ్యాప్త కాంగ్రెస్ ఆందోళనలో భాగంగా ఈరోజు కొండేపిలో ఓటర్లు దొంగ గద్దె దిగు అనే నినాదంతో ప్రజలకు చైతన్యం తేవాలన్నదే మా ధ్యేయమని ఈ సందర్భంగా తెలియజేశారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఉపరాష్ట్రపతి ఎన్నికలలో బిజెపికి మద్దతు తెలపడం దుర్మార్గమని ఎలక్షన్లలో అవకతవకలు జరిగాయి అని చెప్పే ధైర్యం కూడా జగన్మోహన్ రెడ్డికి లేదని ఇది కేవలం వ్యక్తిగత బలహీన కేసులు కోసమేనని రాష్ట్ర ప్రజలు దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా సతీష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు కాకర్లపూడి వేణుగోపాలరావు, జరుగుమల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, టంగుటూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు బదుగు శశి కుమార్,టంగుటూరు మండలం నాయకులు గంగుల పోలయ్య, మర్రిపూడి నాయకులు కమలాకర్ రావు, కొండేపి నాయకులు బి.బాలకోటయ్య, తమ్మిశెట్టి సుధాకర్, రవి సురేంద్ర, ఇతర మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.







## నల్లగుంట్ల, కొర్రపోలు గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని నల్లగుంట్ల, కొర్రపోలు గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.జవహర్ లాల్ నాయక్ పాల్గొని గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను క్షేత్ర సందర్శన చేసి రైతులకు మొక్క జొన్న పంటలో ఎరువుల యాజమాన్యం, సస్య రక్షణ చెర్యలు గురించి రైతులకు తెలియజేయడము జరిగింది. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా అమలువుతున్న ఈ పంట డిజిటల్ సర్వే, ప్రధాన మంత్రి పసల్ భీమా పథకం, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కౌలు రైతులకు కౌలు కార్డులు గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ శేఖర్, గ్రామ వ్యవసాయ సహాయకులు మాధురి, రైతులు పాల్గొన్నారు.

## వాగులు వద్దకు ఈతకు వెళ్లొద్దు: తహసీల్దార్



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని పెద్దదోర్నాల తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ అశోక్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నల్లమల అటవీ ప్రాంతం నుండి భారీ నీరు ప్రవాహంతో చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. వై.చెర్లోపల్లి, తిమ్మాపురం, గంటవానిపల్లి, చిన్నదోర్నాల, ప్రత్యేకంగా గంటవానిపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగినట్లు తెలియజేశారు. గ్రామాల్లో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకర పరిస్థితులు ఉన్న నేపథ్యంలో చిన్న పిల్లలు చెరువులు, వాగులు వద్దకు ఈతకు వెళ్లొద్దని తల్లిదండ్రులు కూడాజాగ్రత్త తీసుకోవాలని సూచించారు. పూరిల్లు ప్రమాదకరంగా ఉంటే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలి అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వీఆర్వోలు, ఎమ్మార్వోలు, పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవో, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



## డ్రైన్ పనులను పరిశీలించిన డిప్యూటీ ఎంపిడివో

బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: బాపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని నందిరాజుతోటలో మంగళవారం జె.సి.బి. ద్వారా కచ్చా డ్రెయిన్లలో పూడిక తీయించే పనులను పర్యవేక్షించిన బాపట్ల డిప్యూటీ ఎంపిడిఓ జి.రామకృష్ణ పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో డ్రైన్‌లను ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం వరద నీరు పారుదల సాఫీగా సాగుతుందన్నారు. అదేవిధంగా గ్రామ శుభ్రత పై ప్రజలు కూడా బాధ్యతను కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు పాల్గొన్నారు.

## సూర్య ఘర్ పథకంలో రుణాల జాప్యం



చీరాల, మేజర్‌న్యూస్: సూర్యఘర్ పథకంలో బ్యాంకుల రుణాలు ఆలస్యం అవుతున్నాయని విద్యుత్ శాఖ సి.ఎం.డి పుల్లారెడ్డి తెలిపారు. బాపట్ల సర్కిల్ కార్యాలయంలో మంగళవారం స్థానిక బాపనమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.విద్యుత్ సరఫరా వ్యవస్థపై విస్తృతంగా సమీక్షించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడం మా ప్రధాన లక్ష్యం. ఎక్కడా లో వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నాం. బాపట్ల పరిధిలో కొత్తగా మూడు సబ్‌స్టేషన్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇవి పూర్తికాగానే విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా ఉంటుంది అని చెప్పారు. గత మూడు నెలల్లోనే జిల్లాలో 1500 వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చామని, మిగిలిన పనులు వందశాతం పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ప్రస్తుతం 204 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని గుర్తుచేశారు. సూర్యఘర్ పథకంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచిత సౌకర్యాలు వచ్చే నెల నుంచే అందించేలా చర్యలు చేపడుతున్నాం అని పుల్లారెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి అన్ని స్థాయిల్లోని అధికారులు హాజరయ్యారు.



## 22న రోటరీ ఉచిత మెగా వైద్య శిబిరం

దర్శి, మేజర్‌న్యూస్: ఒంగోలు కిమ్స్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ దర్శి, ఎస్.టి.ఆర్ మార్కెటింగ్ సహకారంతో పీజీఎన్ తాలూకా కాంప్లెక్స్ నందు ఈనెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకి ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా వైద్య శిబిరానికి స్థానిక తహసిల్దార్ శ్రవణ్ కుమార్‌ని రోటరీ క్లబ్ సభ్యులు ఆహ్వానించారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ప్రారంభించి ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాల పేద ప్రజలు ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారికి ఉన్నటువంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను కనుగొని వాటికి సూచించిన మందులను వాడుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవలసిందిగా, ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.టి.ఆర్ మార్కెటింగ్ యాజమాని సానికొమ్ము తిరుపతిరెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు బోయిళ్ల నాగేశ్వర్ రెడ్డి, సెక్రటరీ అంబవరపు నారాయణరెడ్డి, ట్రెజరర్ కర్ణ రమణారెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, రెడ్డి మాసు శీను, రాజారెడ్డి, పేరి రెడ్డి, మర్తల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 26వ రోజు కామాక్షి అమ్మవారి శ్రావణమాస పూజలు





భట్టిప్రోలు,మేజర్ న్యూస్: మండల కేంద్రం భట్టిప్రోలు శ్రావణ మాసం 26వ మంగళవారం మద్దుల శ్రీనివాసు-అంక సరస్వతి దంపతుల గృహములో శుక్రవారోత్సవ కమిటీ ప్రధాన నిర్వాహకురాలు బూర్లె అరుణకుమారి ఆధ్వర్యంలో కామాక్షి అమ్మవారి అర్చన మరియు పాదారవింద శతకం పారాయణ తదుపరి సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ కామాక్షి దేవి అయిదు రూపాయల లో కొలువై ఉండారని,గాయత్రీ మండపంలో ఉన్న దేవి మూల దేవతగా నాలుగు గోడలు 4 వేదాలుగా, 24 స్తంభాలు గాయత్రి మంత్రంగా,24 అక్షరాలు గాయత్రి మంత్రంగా, 24 అక్షరాలుగా భావి స్తారనీ,అమ్మవారిని కామాక్షి ,స్వర్ణ కామాక్షి, అంజన కామాక్షి,ఉత్సవ కామాక్షి,అనే నాలుగు రూపాల్లో కొలువై ఉన్నారని అరుణకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాటూరు స్వరూప, మటూరు గృహలక్ష్మి,దర్శి శశికళ,బి సుజాత, బూర్లె హేమ పద్మ, ధనలక్ష్మి, సూర్యప్రభ,శ్రీదేవి, రాజ్యలక్ష్మి, మాలతి, లలిత,అనురాధ,కమిటీ సభ్యులు మరియు భక్తుల పాల్గొన్నారు.



## శక్తి యాప్‌పై అవగాహన

చిన్నగంజాం, మేజర్‌న్యూస్: అపద సమయాలలో విద్యార్థునులకు వేంటనే శక్తి యాప్ ద్వారా పోలీసుల సమాచారం ఇస్తే క్షణాల్లో సహాయం అందించేందుకు సిద్ధంగా వుంటామని చిన్నగంజాం మండల ఎస్సై రమేష్ అన్నారు. మండలంలోని అడవీదిపాలెం హైస్కూలు నందు మంగళవారం మండల ఎస్సై రమేష్ అధ్వర్యంలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఇ కార్యక్రమనికి చీరాల సబ్-డివిజన్ శక్తి యాప్ ఎస్సై హరిబాబు హజరై విద్యార్థినీలకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఎవరికైనా ఆపద కలిగితే ఎవరైనా పిలవాలి ఎలా పిలవాలి అనే సందేహాలు వస్తూ ఉంటాయని ఇ సమయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి యాప్‌ని వినియోగిం చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రమేష్, హరిబాబు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం వేడుకలు

బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల ప్రగతి ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌లో సభ్యులు అందరు కలసి రోగులకు బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా సుధాకర్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా బాపట్ల పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంబాబు గౌరవ అతిథిగా బాపట్ల మండల రెవెన్యూ అధికారిని సలీమా జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాబు రోటరీ ప్రెసిడెంట్ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వెజండ్ల శ్రీనివాసరావు హాజరై ఫోటో గ్రాఫర్లను ఉద్దేశించి ప్రశాంగించారు. కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్స్ జ్యోతి స్టూడియో కృష్ణ , రాజా డిజిటల్ స్టూడియో కృష్ణ, వీడియో ఫోటోగ్రాఫర్స్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా జరిగిన పోటీలో ప్రథమ బహుమతి సూర్యలంక బీచ్ ఫోగ్రాఫర్ వీరబాబు, రెండవ బహుమతిగా రాజు స్టూడియో నాగరాజు , మూడవ బహుమతిగా కర్లపాలెం నిరంజన్ కుమార్ గెలుచుకున్నారు.



# పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలి: కమిషనర్



బాపట్ల, మేజర్‌న్యూస్:బాపట్ల పురపాలకసంఘ పరిధిలోని పలు వార్డులలో మంగళవారం మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి పర్యటించారు. పురపాలక సంఘ కార్యాలయం పరిధిలోని సచివాలయ పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శుల రోజువారి పనితీరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. వార్డుల నందు చేపడుతున్న రోజు వారి పారిశుధ్యం గురించి కొన్ని సూచనలు చేశారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వార్డులలో ఎక్కడ కూడాను వర్షపు నీరు నిలిచి ఉండడానికి వీలులేదని దానికి తగ్గ చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. గృహ సముదాయాల మధ్య గల కాళీ స్థలములను గుర్తించి సదర యజమానులకు నోటీసులు జారీ చేసి పిచ్చి మొక్కలు పెరగకుండా మరియు వర్షపు నీరు నిలిచి ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.నీరు నిలిచి యున్న స్థలముల నందు ఆయిల్ బాల్స్ ను ఉంచి యాంటీ లార్వాల్ పిచికారి చేపట్టాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం 3వ వార్డు పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఎక్కువగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారు అవడం గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 బంగారు కుటుంబాల దత్తత ద్వారా ఆయనే ఒక ట్యూషన్ టీచర్‌ను పెట్టి తన సొంత నగదు ఇచ్చి విద్యార్థులకు ట్యూషన్ ఏర్పాటు చేసే విషయమై చర్చించారు. 11వ వార్డు ఇందిరానగర్ నందు గృహ సముదాయాలు మధ్య చేరిన నీటిని కచ్చా కాలువ ద్వారా డ్రైనేజీలోకి మళ్ళించే దానిని దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం గడియార స్తంభం వద్ద గల స్థలం ఖాళీగా ఉండి అపరిశుభ్రంగా ఉండడం ద్వారా అసాంఘిక కార్యక్రమాలు జరుగుచున్న దృష్ట్యా సదరు స్థలాన్ని దగ్గరుండి బాగుచేయించారు.

# గణేష్ మండపాలు ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి: ఎస్సై



పెద్దారవీడు, మేజర్‌న్యూస్: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గ్రామాలలో వినాయక విగ్రహాలు పెట్టి మండపాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ పండుగ శాంతియుతంగా, సుఖశాంతులతో, అందరి సహకారంతో జరగాలని పోలీసులు కోరుతున్నారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా పోలీస్ శాఖ, గ్రామ రెవిన్యూ, విద్యుత్ శాఖవారి అనుమతి తీసుకోవాలి. మండపాలలో శబ్ద యంత్రాలను (డీజే, సౌండ్ సిస్టమ్) రాత్రి 10గంటల తరువాత వినియోగించరాదు. ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా మండపాల ఏర్పాటు చేయాలి. మద్యం సేవించి పండుగల్లో పాల్గొనరాదు. అశాంతి కలిగించే నినాదాలు, పాటలు, ప్రవర్తన పూర్తిగా నిషేధం. నిమజ్జనం సమయంలో క్రమశిక్షణ పాటించి, పోలీసులు సూచించిన మార్గాలనే ఉపయోగించాలి. మండప నిర్వాహకులు సీసీ కెమెరాలు, ఫైర్ ఎక్స్టింగ్విషర్ వంటి భద్రతా చర్యలు చేపట్టాలి. ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వినాయక విగ్రహమును ఏర్పాటు చేసుకొనుటకు మండపం కమిటీ మెంబర్స్ పోలీస్ వారి పర్మిషన్ కొరకు పోలీస్ యాప్‌లో నమోదు చేసుకున్న ట్లయితే, సరైన పత్రాలు ఉన్నట్లయితే అందులోనే పర్మిషన్ కూడా జారీ చేయబడుతుంది. వినాయక మండపాలు ఏర్పాటు చేసిన వారు రాత్రి సమయంలో మండపం వద్దనే పడుకుని అక్కడ పరిస్థితులను పరిశీలిస్తూ ఉండవలెను. వినాయక మండపాలు ఏర్పాటులో బలవంతపు చందాలు వసూలు చేయరాదు అట్లు ఎవరైనా చేసిన యెడల పోలీసువారికి 112కి కాల్ చేసి తెలియపరచగలరు. వినాయక విగ్రహాల ఊరేగింపు సమయంలో గానీ మండపాల వద్ద గాని బాణసంచా పేల్చడం చేయరాదు. ప్రజలందరూ పోలీసులు ఇచ్చే ఈసూచనలు పాటించి, గణేష్ పండుగను శాంతియుతంగా, భక్తి పరవశంతో నిర్వహించుకోవాలని పెద్దారవీడు ఎస్సై వి.సాంబ శివయ్య తెలిపారు.



## పాఠశాలలకు క్లీనింగ్ కెమికల్స్ పంపిణీ : ఎంఈవో

కంభం, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కంభం పాఠశాలల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ క్లీనింగ్ కెమికల్స్ పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో అబ్దుల్ సత్తార్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ పరిధిలోని అన్ని పాఠశాలలకు టాయిలెట్ క్లీనింగ్,ఫ్లోర్ క్లీనింగ్, ఎయిర్ ఫ్రెషనర్స్ పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలకు అవసరమైన క్లీనింగ్ కెమికల్స్ అందిస్తున్నామని, పాఠశాలల్లో పారిశుధ్య అవసరాలకు కెమికల్స్ వినియోగిస్తూ సద్వినియోగం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరనారాయణ, సుబ్రహ్మణ్యం, రవి కిషోర్ రెడ్డి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన గురజాల శ్రీనివాసులు ప్రజాపతి



పామూరు, మేజర్‌న్యూస్: అరివేముల గ్రామానికి చెందిన గురజాల వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు ఏడుకొండలు, బేస్తవారిపేట మండలం పాపాయిపల్లి గ్రామానికి చెందిన ఎర్రపాలెం వెంకట్, చంద్రకళ దంపతుల కుమార్తె హరిప్రియ వివాహం అరివేముల గ్రామంలో మంగళవారం ఘనంగా జరిగింది. వివాహ కార్యక్రమంలో శ్రీ కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షుడు గురజాల శ్రీనివాసులు ప్రజాపతి హాజరై ఆశీర్వచనాలు అందించి నూతన వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులకు దాతలు ప్రోత్సాహక బహుమతులు అందజేత



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని అంబవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2025వ సంవత్సరం పదవతరగతి పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పలువురు దాతలు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పదవతరగతి పరీక్షలలో పాఠశాలలో 547 మార్కులతో ప్రథమస్థానం సాధించిన షేక్ మోబీనాకు పాఠశాల పూర్వవిద్యార్థి చట్టాతిరపతయ్య తరపున హైస్కూలు పూర్వవిద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు 5వేల రూపాయల నగదు బహుమతి అందజేశారు. అదేవిధంగా పాఠశాలలో 2025వ సంవత్సరం పదవతరగతి పరీక్షలలో మొదటిపదిస్థానాలు సాధించిన విద్యార్థులకు పూర్వవిద్యార్థి ముదిరెడ్డి భాస్కరరెడ్డి, నెల్లూరు ఎస్ఆర్‌కె స్కూలు అధినేత పి.కృష్ణమూర్తి సంయుక్తంగా రూ.25వేలు నగదు మెడల్స్ 100పెన్నులు అందజేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సైనిక్ స్కూలు ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇవ్వడానికి స్టడీమెటీరియల్‌కు పాఠశాల స్థలదాత గుంటిమడుగు కృష్ణంరాజు రూ.10వేలు ఉపాధ్యాయుడు చాంద్ బాషాకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యస్.యం.షరీఫ్, పలువురు మాట్లాడుతూ విద్యార్థులకు పోటీతత్వాన్ని పెంచేందుకు అదేవిధంగా ప్రస్తుత విద్యార్థులు ఆదర్శంగా చదువుకుని మంచిఫలితాలు సాధించడానికి మార్గదర్శకంగా పాఠశాల పూర్వ విద్యార్థులు దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం అభినందనీయమని విద్యార్థులు మంచిప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించాలని పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## పెద్ద ఓబులేనిపల్లెలో 'పొలం పిలుస్తుంది'

బేస్తవారిపేట, మేజర్‌న్యూస్: మండలంలోని రెట్లపల్లి, పెద్ద ఓబినేని పల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మొక్కజొన్న పైరును విత్తన ఉత్పత్తి కొరకు సాగు చేసే రైతులు విత్తనోత్పత్తి కంపెనీ ప్రతినిధుల నుండి అగ్రిమెంట్ తీసుకున్న తర్వాతనే సాగు చేయాలని తెలియజేశారు. అలాగే ఎరువుల దుకాణాల నందు విత్తనములు ఎరువులు పురుగు మందులు మొదలైనవి ఏవి కొనుగోలు చేసిన దుకాణ యజమానుల నుండి అడిగి రసీదులు పొందవలెనని అలా తీసుకున్న మసీదులను, ప్యాకెట్లను భద్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. రైతులందరూ మీసేవ కేంద్రాల నందు క్రాఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి పీఎం ఎఫ్బి వై పథకంలో నమోదు చేయించుకోవాలని తెలియజేసినారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి షేక్ అబ్దుల్ రఫీక్, రైతు సేవ కేంద్రాల సిబ్బంది నాగేంద్రకుమార్, వ్యవసాయ విస్తరణాధికారి ఎన్.ఆది గణేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చీరాల రూరల్, మేజర్‌న్యూస్: ఆధునిక వ్యవసాయ విధానాలపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా రైతుల సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి చీరాల మండలం కొత్తపాలెం చీరాల నగర్ పంచాయతీలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా అధికార నిర్మలదేవి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం పొందని రైతులు తమ పేరును గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ గడువు ఆగస్టు 20వ తేదీ బుధవారంతో ముగిస్తుందని చెప్పారు. ప్రస్తుతం గడ్డి గింజలు సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయని రైతులందరూ వీటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## 22 లోగా తాత్కాలిక ఆక్రమణలను తొలగించాలి



దర్శి, మేజర్‌న్యూస్: పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ పొదిలి అద్దంకి కురిచేడు రోడ్డులలో ఆక్రమణలను తొలగించేందుకు వ్యాపారులు, చిరు వ్యాపారాలు చేసేవారు సహకరించాలని దర్శి మున్సిపల్ కమిషనర్ వై మహేశ్వరరావు కోరారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ ఎం శ్రావణ్ కుమార్ అధ్యక్షతన స్థానిక ఎస్సై ఎం.మురళితో కలిసి సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దర్శిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారస్తులు కట్టిన కట్టడాలు సైడ్ కాలువలకు ముందు కూడా అద్దెలకు ఇచ్చుకొని చిరువ్యాపారులు తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నందున ట్రాఫిక్కు అంతరాయం కలుగుతుందని దీనికి వ్యాపారస్తులు చిరు వ్యాపారస్తులు సహకరించాలన్నారు ఇటీవల కొన్ని ప్రమాదాలు జరిగాయని వాటిని అరికట్టాలంటే తోపుడుబండ్ల వాళ్ళందరికీ ప్రత్యేకంగా షెల్టర్లు చూపిస్తామని ఆషెల్టర్లు వ్యాపారాలు నిర్వహించుకోవచ్చునని అన్నారు గడియార స్తంభం సెంటర్లోని ఉండాలంటే ట్రాఫిక్ నిబంధనల ప్రకారము ఇబ్బందులుగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. శుక్రవారంలోపు రోడ్లలో ఉన్న ఆక్రమణన్ని తొలగించాలని లేనియెడల తామే తొలగిస్తామని వారి పేర్కొన్నారు. దీనికి వ్యాపారస్తులందరూ ప్రజలకు సహకరించాలన్నారు. ప్రజల సౌకర్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.